గురువారం
19-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 207
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

డబ్ల్యూఎఫ్‌టీయూ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ షాబాన్ అజౌజ్ కన్నుమూత

ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌టీయూ) మాజీ అధ్యక్షుడు, సిరియాకు చెందిన ప్రముఖ కార్మిక నాయకుడు మహమ్మద్ షాబాన్ అజౌజ్ డమాస్కస్‌లో కన్నుమూశారు.

2లో

బీజేపీ హఠావో...!

దేశ ప్రజల చైతన్యం కోసమే బీఆర్ఎస్

- నష్టాలు సమాజానికి... లాభాలు ప్రైవేటు వ్యక్తులుకా?
- 70 వేల టీఎంసీల నీరున్నా.. నీటియుద్ధాలు చేయాలా?
- మేక్ ఇన్ ఇండియా కాదు... జోక్ ఇన్ ఇండియా
- బీఆర్ఎస్ బహిరంగ సభలో వక్తలు

విశాలాంధ్ర–హైదరాబాద్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ లక్ష్యంగా అన్ని పార్టీలు కలిసి పనిచేయాలని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, కేరళ సీఎం పినరయి విజయన్, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, సీపీఐ జాతీయ కార్యదర్శి డి రాజా పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభకు హాజరైన వివిధ రాష్ట్రాల ప్రముఖులు కేంద్ర ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశంలో అని వర్గాల ప్రజల్లో చైతన్యం నింపడమే లక్ష్యంగా భారత రాష్ట్ర సమితి అవిర్భవించిందని కల్వకుంట్ల చంద్రశేఖరరావు స్పష్టం చేశారు. కెనడా నుంచి కందిపప్పు దిగుమతి సిగ్గుచేటన్నారు. దేశంలో 70 వేల టీఎంసీలు అందుబాటులో ఉండగా వాటిలో కేవలం 20 వేల టీఎంసీలు మాత్రమే వాడుకుంటున్నామన్నారు. బకెట్ నీళ్ల కోసం చెన్నై నగరం అర్రులు చాచాలా అని ప్రశ్నించారు. రాష్ట్రాల మధ్య నీటి యుద్ధాల అవసరం ఎందుకు వచ్చిందని నిలదీశారు. కేంద్ర వైఖరి 'చాటలో తవుడు పోసి కుక్కల కొట్లాట' పెట్టినట్లుందిగా తయారైందని విమర్శించారు. దేశ దుస్థితికి కాంగ్రెస్, బీజేపీనే కారణమని, కాంగ్రెస్ అధికారంలో ఉంటే బీజేపీని

- మిగతా 2 లో

గవర్నర్ల వ్యవస్థ దుర్వినియోగం: డి.రాజా

బీజేపీ గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా అన్నారు. కేరళ, తమిళనాడు, తెలంగాణలో గవర్నర్లు హద్దులు మీరుతున్నారని ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులకు నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో సుపరిపాలన అందుతోందని వెల్లడించారు. విద్యుత్ కోతలు లేని రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని కొనియాడారు. మోదీ పూర్తిగా కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నారని రాజా ధ్వజమెత్తారు. బీజేపీపై ఐక్య పోరాటానికి ఖమ్మం సభ నాంది కావాలన్నారు.

గిల్ డబుల్

టీమిండియా యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. కేవలం 149 బంతుల్లో 19 ఫోర్లు, 9 సిక్సర్లతో 208 పరుగులు పూర్తి చేశాడు. ఈ క్రమంలో ప్రపంచ రికార్డు చేజారినా, విరాట్ కోహ్లి రికార్డును మాత్రం అధిగమించాడు. 19వ వన్డే ఆడుతున్న గిల్ వెయ్యి పరుగుల మార్క్‌ను ఈ మ్యాచ్‌లోనే అందుకున్నాడు.

మూడు రాష్ట్రాల ఎన్నికలు

- త్రిపుర అసెంబ్లీకి ఫిబ్రవరి 16న పోలింగ్
- నాగాలాండ్, మేఘాలయకు ఫిబ్రవరి 27న
- మార్చి 2న ఓట్ల లెక్కింపు
- కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన

న్యూఢిల్లీ: మూడు ఈశాన్య రాష్ట్రాల శాసనసభల ఎన్నికల నగారా మోగింది. ఆ రాష్ట్రాల ఎన్నికల షెడ్యూలును కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. త్రిపురలో ఫిబ్రవరి 16న ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల సంఘం తెలిపింది. మేఘాలయ, నాగాలాండ్‌లో ఫిబ్రవరి 27న పోలింగ్ జరుగుతుందని వెల్లడించింది. ఈ మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు మార్చి 2న వెలువడతాయని పేర్కొంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ బుధవారం

- మిగతా 2 లో

ఇళ్ల సమస్యలపై చరిత్రాత్మక ఉద్యమం

- జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల వద్దకు పార్టీ శ్రేణులు వెళ్లాలి
- ఫిబ్రవరి 22న మహాధర్నాకు వేలాదిగా తరలిరావాలి
- విశాఖ ఉక్కుపై కార్మిక మహాగర్జనకు మద్దతుగా దీక్షలు
- విద్యార్థి, యువజనుల బస్సు యాత్రకు సంఘీభావం
- జీవో-1పై ప్రజా సంఘాలతో న్యాయపోరాటం
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రంలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న ఇళ్ల సమస్యల పరిష్కారం కోసం మరో చరిత్రాత్మక ఉద్యమానికి శ్రీకారం చుట్టామని, పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో భాగస్వాములు కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఐ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త అధ్వర్యంలో జగనన్న కాలనీల్లో నిర్మించే ప్రతి ఇంటికీ రూ.5 లక్షల చొప్పున కేటాయించాలని, టిడ్కో ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17వ తేదీ నుంచి లబ్ధిదారులతో సమావేశాలు ప్రారంభించామన్నారు. ఇళ్ల సమస్యలపై లబ్ధిదారుల వద్దకు పార్టీ శ్రేణులు వెళ్లి, కరపత్రాల పంపిణీ, సంతకాల సేకరణ చేపట్టి చైతన్యవంతుల్ని చేయాలన్నారు. సీపీఐ రాష్ట్ర

- మిగతా 2 లో

కోర్టు ధిక్కరణ...

ఐఏఎస్, ఐఆర్ఎస్‌కు శిక్ష

- క్షమాపణ కోరడంతో తీర్పు సవరణ
- రోజంతా కోర్టులో నిలబడాలని హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : హైకోర్టు ఆదేశాలు అమలు చేయకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడిన ఇద్దరు ఉన్నతాధికారులకు రాష్ట్ర హైకోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించింది. వారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. సర్వీసు అంశాలకు సంబంధించిన కేసులో ఇచ్చిన తీర్పును అమలు చేయలేదని ఐఏఎస్ బుడితి రాజశేఖర్, ఐఆర్ఎస్ రామకృష్ణకు నెల రోజుల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. . గతంలో ఉన్నత విద్యాశాఖలో కార్యదర్శిగా రాజశేఖర్, ఇంటర్ బోర్డు కమిషనర్‌గా రామకృష్ణ పని చేశారు. ప్రస్తుతం సెలవుపై రాజశేఖర్ అమెరికాలో ఉండగా, రామకృష్ణ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఐజీగా ఉన్నారు. దీంతో వీరిద్దరూ కోర్టుకు బేషరతుగా క్షమాపణలు చెపుతూ, మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని చెప్పడంతో తీర్పును సవరిస్తూ... జరిమానా రూ.1000కి కుదిస్తూ, హైకోర్టు ముగిసేవరకు కోర్టులోనే నిలబడాలని ఆదేశించారు.

నిన్న భర్త.. నేడు భార్య

శ్రీహరికోటలో ఆగని ఆత్మహత్యలు

2లో

ఇదీ లోకం!

కొంపదీసి స్పీడు పెంచి గుద్దేయదుకదా!?

ఉక్రెయిన్‌లో హెలికాప్టర్ కూలి

మంత్రితో సహా 18 మంది దుర్మరణం

మృతుల్లో ముగ్గురు చిన్నారులు

2లో

తెలుగువారి ఆస్తి ఎన్టీఆర్: చంద్రబాబు

2లో

మా ఇళ్లు మాకివ్వండి

- ప్రభుత్వ సొమ్ము పునాదులకూ చాలడం లేదు
- జగనన్న కాలనీలు, టిడ్కో లబ్ధిదారుల గోడు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణకు అర్జీల వెల్లువ

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: 'ఏళ్లు గడుస్తున్నా...ప్రభుత్వాలు మారుతున్నా మాత్రం సొంతింటి కల కలగానే మారిపోతుంది. కట్టిన ఇళ్లు సిద్ధంగా ఉన్నా, ఈ ప్రభుత్వం కొద్దిపాటి పనులు కూడా పూర్తి చేయడం లేదు. మా ఇళ్లు మాకు కేటాయించమని ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదు. సంవత్సరాల తరబడి ఎదురుచూపులు తప్ప ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నాం. మీరైనా మాకు ఇళ్లు ఇప్పించండి' అంటూ టిడ్కో లబ్ధిదారులు సీపీఐ నేతలకు విన్నవించుకుంటున్నారు. ప్రభుత్వం తమకు ఇంటి నిర్మాణానికి ఇచ్చే లక్షా 80 వేల రూపాయలు పునాదులకు కూడా చాలడం లేదు. ఇల్లు కట్టకపోతే రద్దు చేస్తామని అధికారులు బెదిరిస్తున్నారు. ఆ డబ్బులతో కట్టలేక, అలాగని వదలుకోలేక, కాలనీలకు కనీస మౌలిక వసతుల్లేక మా ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయని జగనన్న కాలనీ లబ్ధిదారులు వాపోతున్నారు. టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీ సమస్యలపై సీపీఐ ప్రారంభించిన పోరుబాటకు లబ్ధిదారుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విజయవాడ విద్యాధరపురంలోని చెరువు సెంటర్‌లో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పేదానికి, చేసేదానికి ఏమాత్రం సంబంధం లేదని విమర్శించారు. పార్లమెంటులో చెప్పినట్లుగా పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు నిర్మించిన ఇళ్లు కేవలం ఐదు మాత్రమేనని, ఇది సిగ్గు చేటన్నారు. లక్షలాది మంది పేద, దిగువ మధ్యతరగతి ప్రజలు ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా సైంధవుడు మాదిరిగా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. కట్టిన ఇళ్లకు కరెంటు, నీరు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు ఇవ్వకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో 32 లక్షల మందికి ఇళ్లు ఇచ్చామని ప్రభుత్వం చెప్పుకుంటున్నదన్నారు. కమ్యూనిస్టు ప్రభుత్వం ఉన్న కేరళలో ఇంటికి నాలుగు లక్షల ఎనభైవేలు మంజూరు చేశారని, తాము రాష్ట్రంలో రూ.5లక్షలు కోరటం సమంజసమే అన్నారు. టిడ్కో ఇళ్లను

- మిగతా 2 లో

డబ్ల్యూఎఫ్‌టీయూ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ షాబాన్ అజౌజ్ కన్నుమూత

ఏథెన్స్: ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌టీయూ) మాజీ అధ్యక్షుడు, సిరియాకు చెందిన ప్రముఖ కార్మిక నాయకుడు మహమ్మద్ షాబాన్ అజౌజ్ డమాస్కస్‌లో కన్నుమూశారు. ఈ మేరకు డబ్ల్యూఎఫ్‌టీయూ అధికారిక ప్రకటన తెలిపింది. అల్ బాత్ అరబ్ సోషలిస్టు పార్టీ అగ్రనాయకుడు మహమ్మద్ షాబాన్ అజౌజ్ (70) మరణించినట్లు ప్రకటించడం బాధాకరమని డబ్ల్యూఎఫ్‌టీయూ పేర్కొంది. 'కామ్రేడ్ మహమ్మద్ స్వస్థలం అలెప్పో. డబ్ల్యూఎఫ్‌టీ, జీఎఫ్‌టీయూ సిరియా, ఐసీఏటీయూకు అధ్యక్షుడిగా, సిరియా పార్లమెంటు సభ్యునిగా (అల్ బాత్ పార్టీ), సిరియా వర్కర్లు, కర్షకుల సంఘాల అధ్యక్షుడిగానూ కీలక బాధ్యతలు చేపట్టారు. డబ్ల్యూఎఫ్‌టీయూలో చరిత్రాత్మక నాయకుడిగా ఎదిగారు. ఆయన మరణం తీరని లోటు. మిలిటెంట్ ట్రేడ్ యూనియనిస్టుగా చిరస్మరణీయుల'ని డబ్ల్యూఎఫ్‌టీయూ ప్రకటన పేర్కొంది. సిరియా, అరబ్‌తో పాటు ప్రపంచ కార్మికుల జీవితాలను మెరుగుపర్చేందుకు కామ్రేడ్ మహమ్మద్ పాటుపడ్డారని కొనియాడింది. చరిత్రాత్మక నాయకుడిని కోల్పోయామంటూ దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. కామ్రేడ్ మహమ్మద్ తనయుడు, డబ్ల్యూఎఫ్‌టీయూ కార్యదర్శివర్గసభ్యుడు అద్నాన్ అజౌజ్‌కు ధైర్యం చెబుతూ. జీఎఫ్‌టీయూ కామ్రేడ్‌లకు, మహమ్మద్ కుటుంబ సభ్యులకు డబ్ల్యూఎఫ్‌టీ సానుభూతి తెలిపింది. మహమ్మద్ షాబాన్ అజౌజ్ మృతికి పీఏఎంఈ సంతాపాన్ని ప్రకటించింది. 1900-2000లో కార్మిక పోరాటాల్లో మహమ్మద్ కీలకంగా వ్యవహరించారని, ఆయన అజరామరమని పేర్కొంది. అరబ్ దేశాల కార్మిక సంఘాల ఉద్యమాల్లో, ఐసీఏటీయూ, జీఎఫ్‌టీయూ సిరియాకు అమూల్యమైన సేవలు అందించారని గుర్తుచేసింది. గ్రీస్ ట్రేడ్ యూనియన్లు, పీఏఎంఈ వర్గాల మధ్య స్నేహం, సహకారంలో మహమ్మద్‌ది ప్రధాన పాత్రగా కొనియాడింది. ఆయన మరణం దిగ్భ్రాంతికరమని, కార్మిక సంఘాలకు తీరని లోటని పీఏఎంఈ ప్రకటన పేర్కొంది.

పాక్ కమ్యూనిస్టు నేత లతీఫ్ అఫ్రిదీ హత్య

గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ ఖండన

ఏథెన్స్: పాకిస్తాన్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది, ప్రగతిశీల నాయకుడు అబ్దుల్ లతీఫ్ అఫ్రిదీ (79) హత్యకు గురయ్యారు. ఓ సాయుధుడు కేవలం అడుగు దూరం నుంచి అఫ్రిదిపై కాల్పులు జరుపగా ఆయన ఛాతి భాగంలో ఆరు బుల్లెట్లు తగిలాయని, లతీఫ్ అఫ్రిదీ అక్కడికక్కడే కుప్పకూలిపోయారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పెషావర్ హైకోర్టు ఆవరణలో ఈ ఘటన జరిగింది. లతీఫ్ అఫ్రిది హత్యను గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) తీవ్రంగా ఖండించింది. పాకిస్తాన్ కమ్యూనిస్టు నాయకుడు, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లతీఫ్ అఫ్రిదీ కోర్టు ఆవరణలో హత్యకు గురి కావడం ఆందోళనకు గురిచేసిందని కేకేఈ కేంద్ర కమిటీ ప్రకటన పేర్కొంది. పాకిస్తాన్ కమ్యూనిస్టు పార్టీకి, లతీఫ్ కుటుంబం, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు వెల్లడించింది. శ్రామికుల అవసరాలు, హక్కుల కోసం అహర్నిశలు నిస్వార్థ సేవలు అందించిన అఫ్రిది మరణం బాధాకరమని పేర్కొంది. దాడులు, హింస, అపహరణలు, హత్యలు వంటివి జరిగినప్పుడు లతీఫ్ శ్రామిక వర్గానికి అండగా నిలిచినట్లు గుర్తుచేసింది. లతీఫ్ అఫ్రిదీ మానవహక్కుల వాది.. ప్రజల హక్కుల కోసం ప్రజాస్వామ్యం కోసం సుదీర్ఘ పోరాటాల వారసత్వాన్ని వదిలివెళ్లారని కేకేఈ పేర్కొంది. లతీఫ్ హంతకులను ఉపేక్షించరాదని డిమాండ్ చేసింది.

ఫిబ్రవరిలో బ్రిటన్ రైల్వే డ్రైవర్ల సమ్మె

లండన్: బ్రిటన్ వరుస సమ్మెలతో అట్టుడుకుతోంది. ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో బ్రిటన్ రైల్వే డ్రైవర్లు సమ్మెబాట పట్టనున్నారు. ఇప్పటికే అనేక రంగాల సిబ్బంది సమ్మెలు, ప్రదర్శనలు నిర్వహించడం విదితమే. నాలుగు శాతం వేతన పెంపును కోరుతూ రైల్వే డ్రైవర్లు సమ్మె చేపట్టనున్నట్లు రైల్వే డ్రైవర్ల యూనియన్ ప్రకటించింది. 2019 నుంచి రైల్వే డ్రైవర్లకు జీతాల పెరుగుదల లేదని, ప్రభుత్వ మద్దతున్న కంపెనీలు ఈ విషయాన్ని గుర్తించాలని అసోసియేటెడ్ సొసైటీ ఆఫ్ లోకోమోటివ్ ఇంజనీర్స్-ఫైర్‌మెన్ రైలు డ్రైవర్లకు ప్రాతినిధ్యం వహించే ట్రేడ్ యూనియన్ కార్యదర్శి మైక్ విలన్ అన్నారు. వేతనాల్లో నాలుగుశాతం పెంపుదలను కోరుతున్నట్లు తెలిపారు. డ్రైవర్ల జీతాలు పెంచేందుకు, సమ్మెల పరిస్థితిని మార్చేందుకు కంపెనీలు చర్చలు జరపాలని, చర్చల్లో పాల్గొనేందుకు తమ యూనియన్ సిద్ధమేనని ఆయన చెప్పారు. సమ్మెలో అసోసియేటెడ్ సొసైటీ ఆఫ్ లోకోమోటివ్ ఇంజనీర్స్-ఫైర్‌మెన్ యూనియన్ నుంచి 12,500 మంది రైల్వేడ్రైవర్లు పాల్గొనున్నారు. వివిధ రవాణా రంగాల్లో పనిచేస్తున్న డ్రైవర్ల యూనియన్ ఆర్ఎంటీ నుంచి 80 వేల మంది పాల్గొంటారని విలన్ తెలిపారు.

43మంది బ్రెజిల్ అధ్యక్ష భవన సిబ్బందిపై వేటు

బ్రెసీలియా: బ్రెజిల్ అధ్యక్ష భవన భద్రతా సిబ్బంది 43 మందిపై వేటు పడింది. మాజీ అధ్యక్షుడు బోల్సనారో మద్దతుదారులు ఈనెల 8న అధ్యక్ష భవనం, సుప్రీంకోర్టు, పార్లమెంట్‌పై దాడి చేసిన క్రమంలో అధ్యక్ష భవనంలో విధులు నిర్వర్తించే 43 మంది సైనికులను తొలగిస్తూ బ్రెజిల్ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. సాయుధ దళాలతో పాటు ఇనిస్టిట్యూషనల్ సెక్యూరిటీ కేబినెట్ (జీఎస్ఐ) దళాలను విధుల్లో నుంచి తొలగించింది. వేటు పడ్డవారిలో ఏడుగురు అధికారులతో పాటు నేవీ, ఎయిర్ ఫోర్స్, ఆర్మీకి చెందిన దిగువ స్థాయి అధికారులు ఉన్నారు. బోల్సనారో మద్దతుదారుల దాడి వెనుక సైనికుల కుట్ర ఉన్నట్లు బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా వెల్లడించారు. తిరుగుబాటుదారులకు సాయుధ దళాలలో కొందరు సహకరించారన్నారు. తమ అనుమానానికి ఆధారాలు లేకపోలేదని చెప్పారు. భవనం తలుపులు విరగకుండా ఆందోళనకారులు లోపలికికి ఎలా వెళ్లారు? అంటే వాటిని లోపల నుంచి తెరిచారని భావిస్తున్నానని ఆయన వెల్లడించారు.

ఉక్రెయిన్‌లో హెలికాప్టర్ కూలి మంత్రితో సహా 18 మంది దుర్మరణం

కీవ్: ఉక్రెయిన్‌లో అత్యవసర సేవల హెలికాప్టర్ ఓ భవనంలో కూలిపోయింది. ఈ ఘటనలో ఆ దేశ అంతర్గత వ్యవహారాల మంత్రి, సహాయ మంత్రి, సీనియర్ అధికారులతో సహా ముగ్గురు పిల్లలతో కలిపి మొత్తం 18 మంది మృతి చెందారు. బుధవారం ఉదయం రాజధాని కీవ్ సమీపంలో బ్రోవరీలోని నర్సరీకి దగ్గరలోని భవనంపై హెలికాప్టర్ కూలినట్లు ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. 15 మంది పిల్లలతో పాటు 29 మందికి గాయాలైనట్లు కీవ్ గవర్నర్ తెలిపారు. 2021లో అధ్యక్షుడు జెలెన్‌స్కీ నియమించిన అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి డెనిస్ మోనాస్ట్రీక్కీ, సహాయక మంత్రి యెవ్‌హెని యనిన్, ఆ మంత్రిత్వశాఖ కార్యదర్శి ఈ ఘటనలో మరణించినట్లు పోలీస్ చీఫ్ ఇహోర్ క్లిమెంకో వెల్లడించారు. హెలికాప్టర్ కూలిన క్రమంలో జనం పెద్దగా కేకలు వేయడం...భవనం తగలబడిపోవడం వంటి దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలైన వీడియోల్లో కనిపించాయి. ఈ ఘటన జరిగినప్పుడు నర్సరీలో పిల్లలు, సిబ్బంది ఉన్నట్లు కీవ్ గవర్నర్ ఓలెస్కీ కులేబా టెలిగ్రామ్‌లో పేర్కొన్నారు. అత్యవసర సేవల హెలికాప్టర్ కూలిపోవడం దురదృష్టకరమని వైమానిక దళాధికారి యురి ఇహ్నత్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

మూడు రాష్ట్రాల ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

మీడియా సమావేశంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. త్రిపురలో ఫిబ్రవరి 16న, నాగాలాండ్, మేఘాలయలో ఫిబ్రవరి 27న ఎన్నికలు జరుగుతాయని ఆయన చెప్పారు. ఎన్నికల్లో జరిగే అక్రమాలపై సీవిజిల్ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్‌కి తెలియజేయవచ్చునని రాజీవ్‌కుమార్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై 100 నిమిషాల్లోగా స్పందిస్తామన్నారు. ప్రలోభాలు లేకుండా ఎన్నికలు స్వేచ్ఛగా జరగాలంటే ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని స్పష్టం చేశారు. మార్చిలో విద్యార్థులకు పరీక్షలు ఉన్న కారణంగా ఫిబ్రవరిలోనే అసెంబ్లీ ఎన్నికలు ముగించాలని భావించామని కుమార్ చెప్పారు. నాగాలాండ్ శాసనసభ పదవీ కాలం మార్చి 12తోనూ, మేఘాలయ అసెంబ్లీ మార్చి 15తోనూ, త్రిపుర శాసనసభ పదవీ కాలం మార్చి 22తోనూ ముగియబోతోంది. త్రిపురలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలో ఉంది. నాగాలాండ్‌ను నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ పరిపాలిస్తోంది. మేఘాలయలో నేషనల్ పీపుల్స్ పార్టీ కూటమి ప్రభుత్వం ఉంది. జాతీయ గుర్తింపు పొందిన ఈశాన్య రాష్ట్రాలకు చెందిన ఏకైక పార్టీ నేషనల్ పీపుల్స్ పార్టీ ఒక్కటే. నాగాలాండ్, మేఘాలయ, త్రిపురలలో 60 శాసనసభ స్థానాలు చొప్పున ఉన్నాయి. త్రిపురలో తిరిగి అధికారం నిలుపుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తుండగా వామపక్షాలు, కాంగ్రెస్ బీజేపీపై ఉమ్మడిపోరుకు దిగే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. నాగాలాండ్, మేఘాలయకు విస్తరించాలని బీజేపీ కోరుకుంటుంది. ఈశాన్య రాష్ట్రాల్లో పోటీ చేయడం ద్వారా బెంగాల్ వెలుపల కూడా తమ ప్రభావాన్ని చాటుకోవాలని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆకాంక్షిస్తున్నారు.

ఫిబ్రవరి 27న ఉపపోరు

న్యూదిల్లీ: లక్షద్వీప్ లోక్‌సభ స్థానానికి, మరో ఐదు రాష్ట్రాల్లోని ఆరు అసెంబ్లీ స్థానాలకు వచ్చేనెల 27వ తేదీన ఉప ఎన్నికలు జరగనున్నాయి. మహారాష్ట్రలోని కస్బాపేట్, చించ్వాడ్ స్థానాలకు, అరుణాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలోని చెరో స్థానానికి ఉప ఎన్నికలు ఫిబ్రవరి 27న జరగనున్నట్లు ఎన్నికల కమిషన్ బుధవారం ప్రకటించింది. నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) సభ్యుడు మహమ్మద్ ఫైజల్‌పై అనర్హత వేటు క్రమంలో లక్షదీప్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. అరుణాచల్ ప్రదేశ్‌లో ఎమ్మెల్యే జాంబే తాషి మరణంతో లూమా స్థానం ఖాళీ అయింది. జార్ఖండ్‌లో మమతా దేవిపై అనర్హత వేటుతో రామ్‌ఘర్ స్థానానికి ఎన్నికలు అవసరమయ్యాయి. తమిళనాడులోని ఈరోడ్ (తూర్పు) స్థానం ఎమ్మెల్యే ఇ.తిరుమహన్ ఎవరా మృతితో ఖాళీ కాగా పశ్చిమ బెంగాల్‌లోని సాగర్దిఘి స్థానం ఎమ్మెల్యే సుబ్రతా సాహా మరణంతో ఖాళీ అయింది.

జలంధర్ కాంగ్రెస్ ఎంపీ సంతోక్ సింగ్ మరణం గురించి ఈసీకి సమాచారంలేని కారణంగా ఈ పార్లమెంటరీ స్థానానికి ఉప ఎన్నికను బుధవారం ప్రకటించలేదు. కాగా ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 31న జారీ కానున్నది. అయితే మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఈ ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు మార్చి 2న జరుగుతుంది. అదేరోజు త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలనూ ప్రకటిస్తారు.

తొలితరం 'డెక్కన్ క్వీన్ బస్సు' ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నిజాం హయాంలో రవాణా విభాగానికి చెందిన తొలితరం అల్బియాన్ (డెక్కన్ క్వీన్) పాసింజర్ బస్సును ఇద్దరు పదవీ విరమణ డ్రైవర్లు ఆవిష్కరించారు. రవాణాశాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు అధ్వర్యంలో బుధవారం విజయవాడ పండిట్ నెహ్రూ బస్సుస్టేషన్ పక్కనే ఉన్న సిటీ టెర్మినల్ వద్ద ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇద్దరు అధికారులు బస్సుకు సంబంధించిన జ్ఞాపకాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తొలి తరం అల్బియాన్ (డెక్కన్ క్వీన్) పాసింజర్ బస్సులోని సీటింగ్ అమరికను, కిటికీ నమూనాలను పరిశీలించారు. డ్రైవింగ్ సీటులో కూర్చుని, స్టీరింగ్‌ని పట్టుకుని అటూ, ఇటూ తిప్పుతూ ఆనందించారు. ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ... విజయవాడ బస్సు స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులందరికీ, ఈ పురాతన బస్సు కనబడేలా సిటీ పోర్టులో ఏర్పాటు చేశామనీ, ఇది పర్యాటకులకు, ప్రయాణికులకు కనువిందు చేస్తుందని చెప్పారు.

మా ఇళ్లు మాకివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

విజయవాడ నగరంలో 20వేల మందికి మంజూరు చేసినట్లు చెప్పి 11 వేల మందితో డిపాజిట్లు కట్టించుకున్నారని చెప్పారు. కొంతమంది వద్ద రూ.25వేలు, మరికొంత మంది వద్ద రూ.50వేలు కట్టించుకున్నారని, ఇళ్లు కట్టింది కేవలం 6,756 మాత్రమే అన్నారు.

హైకోర్టులో జీవో 1పై విచారణకు వస్తుండగా సుప్రీంకు వెళ్లడమేంటి ?

జీవో నంబరు 1పై హైకోర్టులో మరో రెండురోజుల్లో విచారణకు వస్తుందని తెలిసినా సుప్రీంకోర్టు వెళ్లటం ఏమిటి? అని రామకృష్ణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కోర్టులతో ఆటలాడుకుంటున్నారని విమర్శించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యలను పట్టించుకోనవసరం లేదన్నారు. కమ్యూనిస్టు లేకుండా ఏ ఉద్యమం లేదన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించటం కోసం కమ్యూనిస్టులు ఏ పార్టీ అధికారంలో ఉన్నా పోరాటం చేస్తారని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ సెక్రటరీ దోనేపూడి శంకర్, పార్టీ విజయవాడ నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైడియ్య, పంచదార్ల దుర్గాంబ, కార్యవర్గ సభ్యులు కొట్టు రమణరావు, దోనేపూడి సూరిబాబు, స్థానిక పార్టీ 45వ డివిజన్ కార్యదర్శి ఉప్పలపాటి శివప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి, లబ్ధిదారులకు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు ఇవ్వాలని, సిమెంట్, ఇసుక, ఇనుము ఉచితంగా ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మారెళ్ల గ్రామంలో వున్న జగనన్న కాలనీని సందర్శించారు. అక్కడ లబ్ధిదారులతో మాట్లాడి సంతకాలు సేకరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నబిరసూల్ సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వి.నాగరాజు, బాలగౌడ్, రామాంజిని, వడ్డే నగేష్, సూరారెడ్డి, చిరంజీవి, మాబుపీరా, వినోద్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో

పశ్చిమగోదావరి జిల్లా ఉండి జగనన్న కాలనీల్లో గృహాల నిర్మాణ పనులను సీపీఐ ఉండి మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు పరిశీలించారు. సీపీఐ నాయకులు తమ్మరాని శ్రీనివాస్,కోన గొల్లయ్య, కొడవర్తి రమేష్, పెద్దింటి సింహాచలం, నేర్లగంటి చెంచు, కె.వెంకన్న, కప్పిరి మారయ్య, నేర్లగంటి దుర్గారావు, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి జిల్లాలో

రాజమహేంద్రవరంలోని వెలుగుబంద జగనన్న కాలనీని సీపీఐ బృందం పరిశీలించింది. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సహాయ కార్యదర్శి కొండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, జట్లు లేబర్ యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నల్లా రామారావు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి కిర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐకి రూ.5 వేలు విరాళం

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్) : కమ్యూనిస్టు పార్టీ చేస్తున్న ఉద్యమాల కోసం తమ వంతు బాధ్యతగా బెజవాడ రాజారావు హైస్కూల్ కరస్పాండెంట్ ఐదు వేల రూపాయల విరాళాన్ని చెక్కు రూపంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు అందజేశారు. జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో విద్యాధరపురంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ చెక్కును అందించారు. ఆయన వెంట స్కూల్ కమిటీ ప్రధాన కార్యదర్శి బెజవాడ శ్యామ్‌ప్రకాష్ ఉన్నారు.

బీజేపీ హఠావో...!

(మొదటిపేజీ తరువాయి)

తిడుతుందని, బీజేపీ అధికారంలో ఉంటే కాంగ్రెస్‌ను తిడుతుందని ఆరోపించారు. దేశంలో 4.10 లక్షల మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం ఉందని, కానీ ఎప్పుడూ 2 లక్షల మెగావాట్ల విద్యుత్‌కు మించి వాడలేదని పేర్కొన్నారు. రోజూ వేలాది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నందుకు బీజేపీ ప్రభుత్వం సిగ్గుపడాలని దుయ్యబట్టారు. ఎన్‌పీఏల పేరుతో రూ.14 లక్షల కోట్లు దోచిపెట్టారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే దేశమంతా ఉచిత విద్యుత్ అమలు చేస్తామని ప్రకటించారు. నష్టాలు సమాజానికి లాభాలు ప్రైవేటు వ్యక్తులకా? అని ప్రశ్నించారు. ఎల్ఐసీని అడ్డికి పావుసేరుకు అమ్ముతారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచుతామని, ఇంకా దేశంలో లక్ష కోట్ల మెగావాట్ల జల విద్యుత్‌కు అవకాశం ఉందన్నారు. అవసరం ఉన్నచోట వ్యాపారం చేయడం ప్రభుత్వ విధానంగా మారిందన్నారు. దళితబంధును దేశమంతా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఇవ్వకపోతే తాము దేశమంతా దళితబంధు ఇస్తామని తెలిపారు. విశాఖ ఉక్కును ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం కానివ్వమన్నారు. విశాఖ ఉక్కును మోదీ అమ్మితే తాము అధికారంలోకి వచ్చాక కొనుగోలు చేస్తామన్నారు. లొడలొడ మాట్లాడే ప్రధానికి మంచి నీళ్లు ఇవ్వడం చేతకాదా? అని విమర్శించారు. మేక్ ఇన్ ఇండియా జోక్ ఇన్ ఇండియాగా మారిందని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే అగ్నిపథ్‌ను రద్దు చేస్తామని ప్రకటించారు. కొద్ది రోజుల్లోనే బీఆర్ఎస్ విధానాలు ప్రజల ముందుంచుతామని తెలిపారు. 150 మంది మేధావులు బీఆర్ఎస్ విధానాలు రూపొందిస్తున్నారని వివరించారు.

కేసీఆర్ మాకు పెద్దన్న: కేజ్రీవాల్

కేసీఆర్ తమకు పెద్దన్న లాంటి వారు అని దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. దిల్లీలో కూడా కంటి వెలుగు పథకం తీసుకొస్తామని తెలిపారు. కొత్త కలెక్టరేట్ల నిర్మాణం చాలా అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రధాని మోదీ ఆదేశాలతోనే గవర్నర్ తమిళసై ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. గవర్నర్లు కేవలం కీలుబొమ్మలు మాత్రమే అని, అభివృద్ధికి అడ్డుపడటమే వారి పనా? అని కేజ్రీవాల్ నిలదీశారు.

బీజేపీ అంటే భారతీయ జుమ్లా పార్టీ: మాన్



బీజేపీ అంటే భారతీయ జుమ్లా పార్టీ అని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఎద్దేవా చేశారు. సమయం ఎప్పుడూ ఒకేలా ఉండదని, ఒక్కోసారి రాజు బికారి అవుతాడు, బికారి రాజు అవుతాడన్నారు. విపక్షాల ఎమ్మెల్యేలను కొనాలి, అధికారంలోకి రావాలి ఇదే బీజేపీ తీరని దుయ్యబట్టారు. దానికి ముగింపు పడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయంటూ బీజేపీపై విమర్శలు గుప్పించారు. పంజాబ్‌లో కూడా కంటి వెలుగు మొదలుపెడతామన్నారు. దేశాన్ని భ్రష్టు పట్టించడంలో బీజేపీతో పాటు కాంగ్రెస్ పాత్ర కూడా ఉందని విమర్శించారు.

ఇక్కడ నుంచే కేంద్రంపై సమరం: విజయన్

పోరాటాల పురిటిగడ్డ తెలంగాణ నుంచే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్రంపై సమరశంఖం పూరించారని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. దేశాన్ని అన్ని రకాలుగా సంక్షోభంలో కూరుకుపోవడానికి కారణమైన బీజేపీ పై పోరాటం తప్పదన్నారు. కేంద్ర వైఖరితో రాజ్యాంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని వెల్లడించారు. తెలంగాణ తరహాలోనే కేరళ కూడా అనేక పథకాలు చేపట్టిందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను అనైతిక పద్ధతుల్లో కూలదోస్తోందని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వాలను కూల్చడమే బీజేపీ పని: అఖిలేశ్



ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను బీజేపీ ఇబ్బందులకు గురిచేసి అప్రజాస్వామిక పద్ధతుల్లో రాజ్యాధికారం చేజిక్కించుకోవడమే లక్ష్యంగా పనిచేస్తుందని యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. దీనికోసం గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకోవడంతో పాటు ప్రభుత్వ రంగ వ్యవస్థలను వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీ ఏమైందని వారు ప్రశ్నించారు. చివరకు రైతులకు సరైన మద్దతు ధర లభించట్లేదని, దేశంలో నిరుద్యోగం బాగా పెరిగిందని తెలిపారు.

బాయిలర్‌లో జారిపడి మహిళ మృతి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం రూరల్ : ప్రమాదవశాత్తు బాయిలర్‌లో జారిపడి ఓ మహిళ మృతి చెందిన ఘటన పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగింది. పెంటపాడు మండలం ప్రత్తిపాడులోని ఫుడ్ఫాక్ట్స్ ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీలో పనిచేసే ఒప్పంద కార్మికురాలు దేవేళ్ల వెంకటరమణ (59) బుధవారం ఉదయం 6 గంటలప్పుడు బాయిలర్‌లో ఊక వేసే క్రమంలో అందులో జారి పడింది. బెల్ట్ చిక్కుకోవడంతో ఆమె అక్కడిక్కడే ప్రాణాలు విడిచింది. వెంకటరమణకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమెకు భర్త లేరు. భర్త మరణించడంలో వెంకటరమణ కుటుంబ పోషణకు నడుం బిగించింది. పదేళ్లుగా ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వెంకటరమణ తన కుమార్తెలకు వివాహం చేసింది. తండ్రి లేని లేటు తెలియకుండా అన్నీ తానై పిల్లలను పెంచింది. పండగకు వచ్చిన తమతో సరదాగా గడిపిన తల్లి ప్రాణాలతో లేదని తెలిసి కుమార్తెలు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే వెంకటరమణ చనిపోయిందని బంధువులు, గ్రామస్తులు ఆరోపించారు.

తెలుగువారి ఆస్తి ఎన్టీఆర్: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగు ప్రజలు ఎల్లకాలం గుర్తుంచుకునే వ్యక్తి, తెలుగువారి ఆస్తి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) అని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు. ఒక యుగపురుషునిగా ఎన్టీఆర్ ఉన్నారని అభివర్ణించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎన్టీఆర్ 27వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబుతో పాటు టీడీపీ-ఏపీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రబాబు మాట్లాడుతూ ఒక సాధారణ కుటుంబంలో పుట్టి... అసాధారణ విజయాలు సాధించిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. ఎన్టీఆర్ సినిమా రంగంలో పోషించిన పాత్రలు ఎవరూ పోషించలేదని, ఎంతో ఠీవీ, హుందాతనంతో ఎన్టీఆర్ నటన ఉండేదని గుర్తు చేశారు. ఆయన సినిమాల్లో వినోదంతోపాటు సందేశమూ ఉంటుందన్నారు. ఈ ఏడాది తెలుగుదేశం 40 ఏళ్లు పూర్తి చేసుకుందని, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు జరుపుకుంటున్నామని చెప్పారు. రాజకీయాల్లో పెత్తందారులు కాదు... చదువుకున్న వారిని తీసుకొచ్చి సీట్లు ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. ఎన్టీఆర్ కు నిజమైన నివాళి అర్పించడం అంటే... ఆయన ఆశయ సాధనకు పనిచేయడమేనని నొక్కిచెప్పారు. ప్రభుత్వంపై వ్యతిరేకతతో జనం టీడీపీ సభలకు తరలివస్తున్నారని, ఇప్పుడు జీవో నంబర్-1 తెచ్చి మనల్ని అడ్డుకుంటున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం సమభాగంలో ఉంటేనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. సంక్షేమాన్ని పక్కన పెట్టి... ఈ ప్రభుత్వం ప్రజలపై భారం వేస్తోందన్నారు. మద్యం, ఇసుక ఆదాయం అంతా జగన్ దగ్గరకే రావాలని, నాణ్యత లేని మద్యంతో ప్రజల ప్రాణాలు పోతున్నా జగన్ స్పందించడం లేదని మండిపడ్డారు. డబ్బుతో ఎన్నికల్లో గెలిచేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని, ఎన్ని డబ్బులిచ్చినా వైసీపీకి ఓట్లేసే పరిస్థితి లేదని తెలిపారు.

నిన్న భర్త.. నేడు భార్య

శ్రీహరికోట: శ్రీహరికోట, భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం (షార్)లో వరుస ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. 24 గంటలలో కానిస్టేబుల్, ఎస్సై ఆత్మహత్యకు పాల్పడ్డారు. తాజాగా మరో విషాదం చోటుచేసుకుంది. సీఐఎస్ఎఫ్ సీఐ వికాస్‌సింగ్ సతీమణి ప్రియాసింగ్(27) ఆత్మహత్య చేసుకున్నారు. నర్మద గెస్ట్ హౌస్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొన్నారు. తుపాకీతో కాల్చుకొని వికాస్‌సింగ్ మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు. భర్త మృతి సమాచారాన్ని ఉత్తరప్రదేశ్‌లో ఉంటున్న వారి కుటుంబసభ్యులకు స్థానిక సీఎస్ఎఫ్ అధికారులు తెలిపారు. తన అన్న, పిల్లలతో కలిసి శ్రీహరికోటకు చేరుకున్న ఆమె భర్త మృతదేహం వద్ద కన్నీటిపర్యంతమయ్యారు. నర్మద అతిథి భవన్‌లో ఆమె బస చేశారు. వికాస్ సింగ్ మృతిపై స్థానిక పోలీసులు రాత్రి ప్రియాసింగ్‌ను విచారించారు. అనంతరం అతిథి భవనంలో బంధువులతో కలిసి ఉన్నారు. బుధవారం తెల్లవారుజామున ఆమె గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీనిని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే సీఐఎస్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. మృతదేహాలను శ్రీహరికోట నుంచి పోస్టుమార్టం కోసం సూళ్లూరుపేట సర్వజన ఆసుపత్రికి తరలించారు. భర్త మరణాన్ని తట్టుకోలేకే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. సబ్ ఇన్‌స్పెక్టర్ వికాస్ సింగ్, ప్రియాసింగ్ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు ఒకటో తరగతి, కుమార్తె ఎల్‌కేజీ, మరో కుమార్తె చిన్నపాప. ఇందులో ఓ కుమార్తె వికలాంగురాలు. ఇతని మృతిపైనా అనుమానాలున్నాయి. 2015 బ్యాచ్‌కు చెందిన ఇతను శిక్షణానంతరం ముంబైలోని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తూ.. గతేడాది నవంబరులో బదిలీపై వచ్చారు. ముంబైలో విధులు నిర్వహిస్తున్న సమయంలో క్రమశిక్షణ చర్యలకు గురైనట్లు తెలిసింది.

ఇళ్ల సమస్యలపై చరిత్రాత్మక ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

కార్యవర్గ సమావేశం బుధవారం వర్చువల్ పద్ధతిలో జరిగింది. దీనికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లి విల్సన్ (మాజీ ఎమ్మెల్సీ) అధ్యక్షత వహించారు. విజయవాడ చంద్రం బిల్డింగ్ నుంచి రామకృష్ణతోపాటు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, పి.హరినాథ్‌రెడ్డి, కేవీవీ ప్రసాద్, విశాఖ నుంచి సీపీఐ సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణమూర్తి, గుంటూరు నుంచి జంగాల అజయ్‌కుమార్, కర్నూలు నుంచి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్ర కార్యవర్గసభ్యులతోపాటు జిల్లా పార్టీ కార్యదర్శులు, పట్టణ/నగర కార్యదర్శులు పాల్గొని, పార్టీ పిలుపునిచ్చిన అంశాలపై చర్చించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఇళ్ల సమస్యలపై ఫిబ్రవరి 22న విజయవాడలో జరిగే మహాధర్నాకు ప్రతి జిల్లా నుంచి పెద్దఎత్తున లబ్ధిదారులు తరలివచ్చేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. జగనన్న కాలనీ ఇళ్లు, టిడ్కో ఇళ్ల సమస్యలపైన, విశాఖ ప్లాంట్ ఉద్యమం, ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన బస్సుయాత్రకు మద్దతు తదితర అంశాలపై వివరించారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రూ.5లక్షలు ఇవ్వాలని, ఇసుక, సిమెంట్ ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల కేటాయింపులో జగన్ ప్రభుత్వం తాత్సారం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 80వేల టిడ్కో ఇళ్లు నిర్మించి ఉన్నాయని, వాటికి అన్ని సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్ల సమస్యలపై పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు మన డిమాండ్లతో కూడిన కరపత్రాలు పంచాలన్నారు. ఈనెల 30వరకు అన్ని నగర, పట్టణ, మండలాల్లో పూర్తిస్థాయిలో పార్టీ శ్రేణులు పనిచేయాలని, ఈ ఉద్యమంలో విజయవంతమవుతామన్నారు. విజయవాడలో ఈనెల 22న తలపెట్టిన మహాధర్నాకు అన్ని జిల్లాల నుంచి తరలిరావాలని పిలుపునిచ్చారు. కనీసం జిల్లాకు 1000 మందికి తగ్గకుండా ఉండాలన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం 30వ తేదీన విశాఖలో వేలాదిమందితో కార్మిక మహాగర్జన జరగనుందని, దీనిని విజయవంతం చేయాలని రామకృష్ణ అన్నారు. ఈ గర్జనకు మద్దతుగా సీపీఐ-ఏఐటీయూసీ అధ్వర్యంలో ఈనెల 23, 24 తేదీల్లో ఆర్డీవో కార్యాలయాల ఎదుట, 25న జిల్లా కలెక్టరేట్ల ఎదుట ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పార్టీ శ్రేణులు దీక్షలకు దిగాలన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాలు ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 4 వరకు బస్సు యాత్ర చేస్తున్నాయని, దానికి పార్టీ తరపున సంఘీభావం తెలపాలన్నారు. నీటి ప్రాజెక్టుల స్థితిగతులపై సీపీఐ రాష్ట్రమంతా పర్యటించనుందనీ, దీనిపై త్వరలో రూట్‌మ్యాప్ ప్రకటిస్తామని తెలిపారు. ఈ నెలాఖరులోగా సీపీఐ సభ్యత్వాన్ని పూర్తి చేయాలన్నారు. జీవో నంబరు-1ను రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా జారీజేసిందని, దీనివల్ల ఉద్యమకారులైన వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలకు పూర్తిస్థాయి ఆటంకం కలుగుతుందని రామకృష్ణ చెప్పారు. విద్యార్థి, యువజన సంఘాల బస్సు యాత్రకు ఇంతవరకు అనుమతి ఇవ్వలేదనీ, దానిపై కోర్టును ఆశ్రయించనున్నామన్నారు.

నాడు కడపలో స్టీల్ ప్లాంట్ యాత్రకూ అనుమతివ్వకపోతే, కోర్టుకు వెళ్లి అనుమతి పొందిన విషయాన్ని గుర్తుచేశారు. జీవో-1పై హైకోర్టులో కేసు వేయగా, దానిని సస్పెండ్ చేశారన్నారు. దీంతో ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిందనీ, దానిపైనా మనం పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజా సంఘాల తరపున హైకోర్టులో పిల్ వేయాలని నిర్ణయించామన్నారు. జీవో-1కు వ్యతిరేకంగా న్యాయపోరాటంలో సీపీఐ అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతాంగ సమస్యలపై రైతు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై చేపట్టనున్న ఉద్యమానికి సంఘీభావం తెలపాలన్నారు.

ఫిబ్రవరి రెండోవారం వరకు ధాన్యం కొనుగోళ్లు

- వచ్చేనెల 20న రబీ ఈ-క్రాప్ బుకింగ్
- మార్చి మొదటివారంలో తుది జాబితా వెల్లడి
- సమీక్షలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ధాన్యం కొనుగోళ్లు ఫిబ్రవరి రెండోవారం వరకు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రబీకి సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ ఫిబ్రవరి 20 నుంచి ప్రారంభిస్తామని, మార్చి మొదటి వారంలో తుది జాబితా వెల్లడిస్తామని అధికారులు బుధ వారం ముఖ్యమంత్రి జగన్‌కు తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధి కారులతో సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. ఆహార ధాన్యాల ఉత్పత్తి, సేకరణపై వివరాలను అధికారులు వెల్లడించారు. 2019కి ముందు-తర్వాత సగటు ఆహారధాన్యాల ఉత్పత్తి వివరాలనూ తెలిపారు. సీఎం మాట్లాడుతూ రబీలో రైతులకు విత్తనాలు, ఎరువులకు ఇబ్బంది రాకుండా చూడాలని ఆదేశించారు. ఆర్బీకేల ద్వారా రైతులకు ఎరువులు అందేలా చూసుకో వాలని సూచించారు. గన్నీబ్యాగుల డబ్బులు, రవాణా ఖర్చులనూ రైతులకు ఇస్తున్నామన్నారు. 89 శాతం చెల్లింపులు జరిగాయని తెలిపారు. ఇప్పటివరకూ రూ.5,373 కోట్లు విలువైన ధాన్యాన్ని సేకరించామని, ఆయా ప్రాంతాల్లో పంటల సీజన్ల దృష్ట్యా ఫిబ్రవరి రెండోవారం వరకూ సేకరణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఈ-క్రాప్ డేటా మేరకు ధాన్యం కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారు. మిల్లర్లు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా మిగిలిన సేకరణ కూడా జరగాలని, రైతులకు ష్టంలేకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ఏమైనా సమస్యలున్నా, మిల్లర్లు, మధ్యవర్తుల ప్రమేయమున్నా ఫిర్యాదు చేయడానికి వీలుగా నంబర్‌ను ఏర్పాటు చేయాలని, రైతులు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించాలని సూచనలు చేశారు. ఆర్బీకేల స్థాయిలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు, కిసాన్ డ్రోన్లు, రైతులకు 50శాతం సబ్సిడీతో వ్యక్తిగత వ్యవసాయ పరికరాల పంపిణీపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. మార్చి, మే-జూన్ నెలల్లో ఈ కార్యక్రమాలను అమలు చేస్తామని అధికారులు తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ ద్వారా శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధికారులు తెలుపగా వాటిని వేగవంతం చేయాలని సీఎం సూచించారు. మాండస్ తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారమిచ్చేందుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఏపీ అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎంవీయస్ నాగిరెడ్డి, వ్యవసాయశాఖ సలహాదారు ఐ.తిరుపాల్‌రెడ్డి, వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ (ఎఫ్ఏసీ) వై మధుసూధన్‌రెడ్డి, మార్కెటింగ్, సహకారం ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి, పౌర సరఫరాలశాఖ కమిషనర్ హెచ్ అరుణ్‌కుమార్, ఏపీ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ వీసీ అండ్ ఎండీ జీ వీరపాండ్యన్, సివిల్ సప్లైస్ డైరెక్టర్ ఎం విజయ సునీత, వ్యవసాయశాఖ కమిషనర్ సీహెచ్ హరికిరణ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ వీసీ&ఎండీ శేఖర్ బాబు, ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ పాండే, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

దావోస్ ఆర్థిక సదస్సుకు సీఎం ఎందుకెళ్లలేదు?

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సుకు ఎందుకు వెళ్లలేదో వెల్లడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. మూడున్నరేళ్లలో ఏపీకి ఎన్ని పెట్టుబడులు వచ్చాయో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సుకు సీఎం జగన్ హాజరు కాలేదని, తెలంగాణ ఐటీ మంత్రి కేటీఆర్ దావోస్ వెళ్లి రూ.2 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చుకున్నారని తెలిపారు. మూడేళ్ల కాలంలో తెలంగాణకు రూ.3.80 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటూ కేటీఆర్ ప్రకటించారన్నారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడులో ఆయా ప్రభుత్వాలు పెట్టుబడులు సాధించేందుకు చొరవ చూపుతూ పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తుంటే, ఏపీలో జగన్ సర్కార్ మాత్రం కేవలం అప్పులు తేవడంపై మాత్రమే దృష్టి సారిస్తోందని ఎద్దేవా చేశారు. ఏపీలో పారిశ్రామిక అభివృద్ధిని వైసీపీ సర్కార్ విస్మరించిందని, మూడున్నర ఏళ్లలో కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదని పేర్కొన్నారు. వైసీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు పారిశ్రామికవేత్తలపై బెదిరింపులకు, వేధింపులకు పాల్పడుతూ రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు కూడా తరలిపోయేలా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. దీంతో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు, ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపడం లేదన్నారు. మొత్తం మీద ఏపీలో పారిశ్రామిక ప్రగతి పడకేసిందని, ఏపీకి పెట్టుబడులు వస్తాయనే నమ్మకం లేకనే సీఎం జగన్ దావోస్‌కు వెళ్లలేదన్నట్లుగా వార్తలు గుప్పుమంటున్నాయని విమర్శించారు. జగన్ ఇప్పటికైనా దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సుకు ఎందుకు వెళ్లలేదో వెల్లడించాలన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో ఏపీకి ఎన్ని పెట్టుబడులు వచ్చాయో, కొత్తగా ఎన్ని పరిశ్రమలు ఏర్పాటయ్యాయో శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సాగుదారుల హక్కు పత్రం చట్టాన్ని సవరించాలి

- కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి
- ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సాగుదారుల హక్కు పత్రం చట్టం-2019ను సవ రించి భూ యాజమాని ప్రమే యం లేకుండానే కౌలురైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. విజయవాడ దాసరిభవన్‌లో బుధవారం కౌలురైతుల విస్తృతస్థాయి సమావేశం రైతుసంఘం అధ్వర్యంలో జరిగింది. సమావేశానికి సంఘం ఉపాధ్యక్షుడు అన్నగిరి కాటమయ్య అధ్యక్షత వహించారు. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ కౌలు రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. స్వీయ ధ్రువీకరణతో కౌలురైతుల పంటలను ఈ-క్రాప్ నమోదు, తద్వారా ఉచిత పంటల బీమా, నష్టపరిహారం, పంటలు విక్రయించుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు భూ యజమానుల రుణాలతో సంబంధం లేకుండా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలివ్వాలన్నారు. రైతుభరోసా జీవో-96ను సవరించి సొంత భూమిలేని కౌలు రైతులందరికీ ఎకరానికి రూ.10వేలు ఇవ్వాలని, కౌలు రేట్లు నియంత్రణకు కౌలు ధరల నియంత్రణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. అన్నగిరి కాటమయ్య మాట్లాడుతూ 55 ఏళ్లుపైబడిన కౌలు రైతులందరికీ నెలకు రూ.10వేలు పింఛను మంజూరు చేయాలని కోరారు. దేవాలయం కౌలు రైతులందరికీ వ్యవసాయ పథకాలు వర్తింపజేయాలన్నారు. రైతు సంఘం మాజీ అధ్యక్షులు కె.రామకృష్ణ మాట్లాడుతూ కౌలురైతులను ఆదుకోవ దానికి సమగ్ర చట్టం తేవడం ద్వారా రక్షణ కల్పించాలన్నారు. సాగుదారుల్లో నూటికి 70శాతం కౌలురైతులే ఉన్నారని, ప్రభుత్వ సహాయం లేక అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వీరిని ఆదుకోవాలని కోరారు. మార్చి మొదటి వారంలో విజయవాడలో కౌలురైతుల సమస్యలపై రాష్ట్ర సదస్సు నిర్వహించాలని ఈ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. రైతుసంఘం కోశాధికారి సీహెచ్ కేశవ్‌శెట్టి, కార్యదర్శి మల్నీడు యల్లమందారావు, నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, కొల్లి రంగారెడ్డి, రాయంకుల లక్ష్మణరావు పాల్గొన్నారు.

రైతుల్ని ఆదుకోవడంలో పాలకులు విఫలం

ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: నూతన సంవత్సరం (2023) రైతన్న డైరీని, రైతులోకం పుస్తకాన్ని బుధవారం కర్నూలు జిల్లా పత్తికొండలోని చదువుల రామయ్య భవనంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో అరకొర గా కురిసిన వర్షాలకు రైతులు వివిధ రకాల పంటలను సాగు చేశారని, అక్టోబర్ లో కురిసిన అధిక వర్షాలకు అన్ని రకాల పంటలు పూర్తిగా దెబ్బతిని తీవ్రంగా నష్టపో యారన్నారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, పంటల బీమా పథకం అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని, పంట పెట్టుబడికి బ్యాంకుల్లో తీసుకున్న అన్ని రకాల రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. దేశానికి అన్న వస్త్రాలను అందించే రైతన్నలను ఆదుకోకపోతే పార్టీలకతీతంగా రైతులం దరినీ సమీకరించి,ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు పి.భీమ లింగప్ప, ఏపీ రైతు సంఘం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు కారన్న, పెద్ద ఈరన్న, సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి ఎన్.రామాంజనేయులు, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు గురుదాస్, ఉమాపతి, వెంకటరామిరెడ్డి, ఓబులేసు, పరమేశ్వర, ఉచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

విట్‌లో గ్రీన్ ఎనర్జీ కన్జర్వేషన్ వీక్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యార్థులలో ఇంధన సామర్థ్యం, పొదుపుపై అవగాహన కలించేందుకు వీఐటీ-ఏపీ విశ్వ విద్యాలయంలో 'గ్రీన్ ఎనర్జీ కన్జర్వేషన్ వీక్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. విట్ స్కూల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (సైన్స్), స్పిరిట్ ఆఫ్ ఎనర్జీ క్లబ్ సంయుక్త అధ్వర్యంలో ఈనెల 24వ తేదీ వరకు వారం రోజులపాటు జరుగనున్న ఈ కార్యక్రమాన్ని వీఐటీ వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డాక్టర్ జీ.విశ్వనాథన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధనం ఆదాను పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులంతా అలవాటు చేసుకోవాలని, మిగిలిన వారిలో కూడా దీనిపై అవగాహన కల్పించేలా కృషి చేయాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో వాడే సెల్ ఫోన్, ల్యాప్‌ట్యాప్ వంటి విద్యుత్ ఉపకరణాల అనవసర వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. జాతీయ ఇంధన పరిరక్షణ ప్రచారంలో ప్రధాన పాత్ర పోషించే అదనపు శక్తిని ఆదా చేయడానికి సులభమైన, అత్యంత ప్రభావవంతమైన మార్గమవు తుందన్నారు. అతితక్కువ కాలంలో వీఐటీ -ఏపీ విశ్వవిద్యాలయం 1000 అకడమిక్ రీసెర్చ్, పబ్లికేషన్స్ మైలురాయిని చేరటం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ దేశవ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకుంటున్న నేపథ్యంలో దేశ చరిత్ర, సంస్కృతి, విజయాలను స్మరించుకోవడంతో పాటు ఇంధన సామర్థ్యం, పరిరక్షణలో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా కళాశాల విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్, స్ట్రీట్ ప్లే, మోడల్ డెమోనిస్ట్రేషన్, డిబేట్స్, క్విజ్ పోటీలు, పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్, పెయింటింగ్, పద్యం పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ ప్రెసిడెంట్ జీ.వి.సెల్వం, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగులను నియంత్రించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పార్వతీ పురం మన్యం జిల్లాలో ప్రజల ప్రాణాలకు, పంటలకు, ఆస్తులకు నష్టం కలిగిస్తున్న ఏను గులను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, భామిని మండలం తాలాడ గ్రామంలో ఏనుగుల దాడి వల్ల గోరుచిట్టి చిన్నారావు మృతి చెందడం పట్ల విచారం వ్యక్తం చేశారు. చనిపోయిన చిన్నారావు కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మన్యం జిల్లాలో జియ్యమ్మ వలస, కొమరాడ, భామిని, కొత్తూరు మండలాల్లో రెండు ఏనుగుల గుంపులు తిరుగు తున్నాయని, అయినా ప్రభుత్వ యంత్రాంగం ప్రజ లను హెచ్చరిస్తూ ఏ ప్రకటనా చేయలేదన్నారు. 2018 నుంచి జిల్లాలో 6 మండలాల్లోని గ్రామాల్లో ఏనుగుల భీభత్సం వల్ల రూ.3 కోట్లకుపైగా పంట నష్టం వాటిల్లిందని, ఏడుగురికి పైగా మృతి చెందారని, పశువులు కూడా మృత్యువాత పడుతున్నాయని వివరించారు. నాలుగేళ్ల నుంచి ఏనుగులను తరలించాలని మంత్రులకు, ఫారెస్టు అధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ ఫలితం లేదన్నారు. ప్రజల ప్రాణాలు పోతున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహించడం గర్హనీయమని, నిరసన తెలియజేసిన వారిపై కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు.

ఆదర్శ కమ్యూనిస్టు బాబురావుకు ఘనంగా వీడ్కోలు

విశాలాంధ్ర-చల్లపల్లి: వక్కలగడ్డ లో మంగళవారం మృతి చెందిన రావి బాబురావు అంత్యక్రియలు బుధవారం ఉదయం నిర్వహించారు. తొలుత అంతిమయాత్రలో పార్టీలకు అతీ తంగా వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. అందరి తలలో నాలుకలా ఉండే బాబురావు మృతి తీరని లోటని, ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ అనేకమంది కన్నీటి పర్యంతమయ్యారు. రావి బాబురావు అమర్ రహే, జోహార్ రావి బాబురావు అన్న నినాదాలతో వక్కలగడ్డ పురవీధులు హోరెత్తాయి. కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎర్రజెండాలు చేతబూని అంతిమయాత్రలో పాల్గొన్నారు. బాబురావు భౌతికాయాన్ని స్థానిక శాసన సభ్యుడు సింహాద్రి రమేష్ బాబు, వైఎస్ఆర్సీపీ జిల్లా నాయకుడు కడవకొల్లు నరసింహారావు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామ ర్శించారు. అంతిమయాత్రలో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్, సీపీఐ జాతీయ సమితి సభ్యులు అక్కినేని వనజ, విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు, సీపీఐ కృష్ణాజిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి టి.తాతయ్య, జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్ బాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్, హైదరాబాద్ సిటీ కార్యదర్శి హనుమానుల జగన్మోహన రావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. ఓబులేసు, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మల్లుపెద్ది రత్నకుమారి, దేవ భక్తుని నిర్మల, వక్కలగడ్డ, చల్లపల్లి గ్రామ సర్పంచులు వల్లూరి ఉమా, పైడిపాముల కృష్ణకుమారి, సీపీఐ నాయకులు మాలెంపాటి కాంచనరావు, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, గుత్తికొండ రామారావు, మల్లుపెద్ది బోసు, అట్లూరి వెంకటేశ్వరరావు, అల్లూరి బాబురావు, మల్లుపెద్ది జగన్ మోహన్ రావు, పాలడుగు రత్న కుమార్, పాలడుగు ఆనంద్ కుమార్, మోతుకూరి అరుణ్ కుమార్, నక్కా శ్రీను, కొల్లూరి శ్రీధర్, సిద్దాబత్తుల వాసు, మాలంపాటి కోటేశ్వరరావు, రావి ప్రభు ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు పరిసే మౌళి, గుత్తికొండ ప్రసాద్ వైఎస్ఆర్సీపీ నాయకుడు మోత్కూరి ఏడుకొండలు,ఆర్టీసీ యూనియన్ నాయకులు కొండవీటి రాంప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భూపోరాటాలలో బాబురావు పాత్ర ఎనలేనిది: రావుల వెంకయ్య

రావి బాబూరావు భౌతికాయాన్ని ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య, సందర్శించి విప్లవ జోహార్లు అర్పించారు. తన జీవితం మొత్తాన్ని కమ్యూనిస్టు పార్టీకి అంకితం చేసిన నిస్వార్థ కమ్యూనిస్టు బాబురావు అని కొనియాడారు. వక్కలగడ్డ లో జరిగిన ఉద్యమాలు, భూ పోరాటాల లో ఆయన పోషించిన పాత్ర ఎనలేనిదన్నారు. ప్రజానాట్యమండలి కళాకారునిగా, కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించి పాలకులను ప్రశ్నించడంలో ముందుండేవారన్నారు. చంద్ర రాజేశ్వరరావు లాంటి గొప్ప నాయకులు పుట్టిన దివి ప్రాంతానికి పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి పార్టీని ముందుకు నడిపించడంలో విజయం సాధించారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ... ప్రజా కళాకారుడిగా పార్టీ ఉద్యమాలలో ఎప్పుడూ ముందుండే బాబురావు మరణం పార్టీకి, ప్రజా సంఘాలకు తీరని లోటన్నారు. చంద్ర రాజేశ్వరరావు, దాసరి నాగభూషణం వంటి అగ్ర నాయకులతో పనిచేసిన ఆయన , నేటి తరం నాయకులతో కూడా అదే రీతిలో కలిసి పనిచేయడం ఆయన అంకిత భావానికి నిదర్శనమన్నారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్ మాట్లాడుతూ ప్రజా కళాకారుడిగా సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలపై సమాజాన్ని చైతన్య పరచడంలో బాబురావు ముఖ్య భూమిక పోషించారాన్నరు. సీపీఐ జాతీయసమితి సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ నిబద్ధత గల నాయకుడ్ని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి నిరంతరం పరి తపించే వారని పేర్కొన్నారు.

ఎస్సీల అభివృద్ధికి రూ.9,225 కోట్లు

ప్రాంతీయ రాష్ట్రాల సదస్సులో మంత్రి మేరుగు నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధికి ఈ ఏడాది రూ.9,225.28 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. షెడ్యూల్ కులాల వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని మైసూరులో బుధవారం ప్రారంభమైన రెండు రోజుల తొమ్మిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రాంతీయ సదస్సులో నాగార్జున పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. అంబేద్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా తమ ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్‌లో భాగంగా జూన్ 2019 నుంచి 2022 డిసెంబరు వరకు రూ.49,710.17 కోట్లను ఖర్చు చేశామని తెలిపారు. నవరత్నాల్లో భాగంగా వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా 11.82 లక్షల మంది ఎస్సీ పెన్షనర్ల కోసం రూ.7,950.33 కోట్లను ఖర్చు చేశామని, అమ్మఒడి పథకం ద్వారా 26.56 లక్షల మంది తల్లులకు రూ.2,715.35 కోట్లు, వైఎస్సార్ ఆసరా పథకం కింద 33.50 లక్షల మంది లబ్ధిదారులకు రూ.2,567.63 కోట్లు, వైఎస్సార్ చేయూత పథకం కింద 17.89 లక్షల మందికి రూ.3,356.41 కోట్లు, వైఎస్సార్ వాహన మిత్ర పథకం కింద 2.44 లక్షల మందికి రూ.243.72 కోట్లు అందించామని వివరించారు. జగనన్న తోడు పథకం కింద 3.39 లక్షల మందికి రూ.7.95 కోట్లు, జగనన్న చేదోడు పథకం కింద 48 వేల మందికి రూ.43.98 కోట్లు, వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద 2,437 మందికి రూ.5.81 కోట్లు, మత్స్యకార భరోసా పథకం కింద 3,283 మందికి రూ.3.28 కోట్లు, జగనన్న వసతి దీవెన పథకం కింద 3.89 లక్షల మంది విద్యార్థులకు రూ.668.995 కోట్లు, జగనన్న విద్యా దీవెన పథకం కింద 4.44 లక్షల మంది విద్యార్థులకు రూ.1,755.35 కోట్లు అందించామని చెప్పారు. 2023-24లో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద 60 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.21.55 కోట్లు, వైయస్సార్ కళ్యాణమస్తు పథకం కింద రూ.211.63 కోట్లు అందించనున్నామని మంత్రి నాగార్జున తెలిపారు. నాన్ డీబీటీ ద్వారా వైయస్సార్ ఆరోగ్యశ్రీ, జగనన్న గోరుముద్ద, జగనన్న తోడు, వైయస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ విద్యా కానుక, జగనన్న ఇళ్లు, వైఎస్సార్ కంటి వెలుగు తదితర పథకాల కింద 56.32 మంది లబ్ధిదారులకు రూ.28,958.30 కోట్లు అందించామని వెల్లడించారు.

ఉద్యోగుల ప్రయోజనాలే లక్ష్యం

ఏపీఎన్జీవో అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, కె.వి.శివారెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ఉద్యోగుల ప్రయోజనాలే లక్ష్యంగా నూతన కార్యవర్గం పని చేస్తుందని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వస్తామని, సమస్యలను పరిష్కరించకుంటే ప్రత్యక్ష పోరాటానికి సిద్ధంగా ఉంటామని ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర సంఘానికి నూతనంగా ఎన్నికయిన అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డి తెలిపారు. రాష్ట్ర సంఘానికి నూతన కార్యవర్గ ఎన్నికను బుధవారం విజయవాడ గాంధీనగర్‌లోని ఏపీఎన్జీవో హోమ్‌లో నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గానికి అధ్యక్ష, కార్యదర్శులుగా పోటీ చేసిన బండి శ్రీనివాసరావు, కె.వి.శివారెడ్డి ప్యానెల్ అభ్యర్థులు, వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన ఉద్యోగ సంఘ నాయకులు, ఉద్యోగులతో కలిసి ఏలూరు రోడ్డు పాత బస్టాండ్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి ఎన్జీవో హోమ్‌కు చేరుకుని ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కార్యవర్గంలోని ఒక్కొక్క పదవికి ఒక్కొక్క అభ్యర్థి మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో పోటీలో ఉన్న అభ్యర్థులు గెలుపొందినట్లు ఎన్నికల అధికారి జి.రామకృష్ణా రెడ్డి ప్రకటించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడిగా ఎన్నికయిన బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామన్న నమ్మకంతో రాష్ట్ర సంఘానికి తనను రెండవ సారి అధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల కృతజ్ఞత తెలిపారు. ఉద్యోగుల డీఏ, పీఆర్సీ బకాయి చెల్లింపు, జీపీఎఫ్, ఇన్సూరెన్స్, సరెండర్ లీవ్ వంటి బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వం తాత్సారం చేయడం తగదన్నారు. 11వ పీఆర్సీలో ఉద్యోగులకు అరకొర లబ్ధే చేకూరిందని, ఈ ఏడాది జులై నుంచి 12వ పీఆర్సీ అమలు చేయవలసి ఉందని, ప్రభుత్వం పీఆర్సీ కమిటీ వేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ రద్దుతో పాటు అనేక డిమాండ్లు సంవత్సరాలు తరబడి అపరిష్కృతంగా ఉన్నాయని అన్నారు. ఉద్యోగులపై ప్రభుత్వానికి చిన్న చూపు తగదని, ఇప్పటికైనా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన బాట పట్టేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

ఏపీఎన్జీవో రాష్ట్ర నూతన కార్యవర్గం... రాష్ట్ర సంఘ అధ్యక్షులుగా బండి శ్రీనివాసరావు (జలవనరులు శాఖ, ఒంగోలు) ప్రధాన కార్యదర్శిగా కె.వి.శివారెడ్డి (వైద్య ఆరోగ్య శాఖ, వైఎస్సార్ కడప జిల్లా), సహ అధ్యక్షులుగా సిహెచ్ పురుషోత్తంనాయుడు (కమర్షియల్ టాక్స్ శాఖ, శ్రీకాకుళం), కార్యనిర్వహక కార్యదర్శిగా కె.జగదీశ్వరరావు (మైనర్ అండ్ మీడియం ఇరిగేషన్ శాఖ విజయవాడ), కోశాధికారిగా ఎ.రంగారావు (మైనర్ అండ్ మీడియం ఇరిగేషన్ శాఖ, విజయవాడ), ఉపాధ్యక్షులుగా డి.వి.రమణ (వైద్య ఆరోగ్య శాఖ, విజయనగరం), వై.ప్రసాద్ (వైద్య ఆరోగ్య శాఖ, వైస్సార్ కడప), పి.శ్రీనివాస్ (వైద్య ఆరోగ్య శాఖ, తూర్పుగోదావరి), వి.దస్తగిరిరెడ్డి (వైద్య ఆరోగ్య శాఖ, కర్నూలు), జె.మాధవ్ (వైద్య ఆరోగ్య శాఖ, అనంతపురం), ఎ.శ్రీనివాసరావు (వైద్య ఆరోగ్య శాఖ, కృష్ణాజిల్లా), పి.శ్రీనివాసులు (వైద్య ఆరోగ్య శాఖ, భీమవరం), ఎస్.కె.నాగూర్ షరీఫ్ (వైద్య ఆరోగ్య శాఖ, గుంటూరు), ప్రచార కార్యదర్శిగా బి.జానకి (ఆయుష్ శాఖ, విజయవాడ), కార్య దర్శులుగా వి.సుబ్బా రెడ్డి (వైద్య ఆరోగ్య శాఖ, విజయవాడ) ఎస్.బి. వి.రాంప్రసాద్, (వ్యవసాయ శాఖ, గుంటూరు), ఎ.రంజిత్‌కుమార్ నాయుడు (డైరెక్టర్ ఆఫ్ ఇన్సూరెన్స్, మంగళగిరి), ఎం.వి. కృష్ణారెడ్డి (దేవాదాయ శాఖ, విజయవాడ), పి.శివప్రసాద్ (పే అండ్ ఎకౌంట్స్, మంగళగిరి), మహిళా కార్యదర్శిగా పి.తులసీరత్నం (సర్వే శాఖ విజయవాడ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ప్రభుత్వ సలహాదారులు (ఉద్యోగుల సంక్షేమం) ఎన్.చంద్రశేఖర్ రెడ్డి, జేఏసీ నాయకులు హృదయరాజు, బొప్పరాజు వెంకటేశ్వర్లు, వైవీ రావు, ఎన్‌టీఆర్, కృష్ణా జిల్లా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, ఉల్లి కృష్ణ, కర్నూలు జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంగళరెడ్డి, గుంటూరు జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, పశ్చిమ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాసరావు, శ్రీకాకుళం అధ్యక్షులు సాయిరాం, కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాస్, చిత్తూరు జిల్లా అధ్యక్షులు రాఘవులు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యోగ సంఘ నాయకులు, పెన్షనర్ల సంఘ నాయకులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

కేఎల్‌యూ పరిశోధకుడు డా.చాంద్‌బాషాకు అంతర్జాతీయ గుర్తింపు



విశాలాంధ్ర-తాడేపల్లి: కేఎల్ డీమ్డ్ విశ్వ విద్యాలయం బయోటెక్నాలజీ విభాగంలో పరిశోధ కుడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ షేక్ చాంద్ బాషాకు అరుదైన గౌరవం లభించింది. ప్రపంచ వ్యాప్తంగా న్యూరో కెమిస్ట్రీపై పరిశోధన చేసే అంతర్జాతీయ సంస్థకు భారత రాయబారిగా డాక్టర్ షేక్ చాంద్ బాషా ఎంపికైనట్లు విశ్వవిద్యాలయం ప్రో చాన్సలర్ డాక్టర్ కేవీస్ జగన్నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా న్యూరో సైన్స్ మీద వివిధ పరిశోధనలు చేసిన అనేక మంది పరిశోధకులు దరఖాస్తులు చేసుకున్నారని, వారిలో చాంద్‌బాషా ఎంపికవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ న్యూరో కెమిస్ట్రీ పరిశోధన సొసైటీ(ఐఎస్ఎన్) ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండులో ఉందన్నారు. ఐఎస్ఎన్ ఆహ్వానంపై గత నెలలో అమెరికాలో జరిగిన సదస్సుకు హాజరైన షేక్ చాంద్ బాషా... న్యూరో కెమిస్ట్రీ మీద తాను చేసిన పరిశోధనలను ప్రదర్శించారని తెలిపారు. ఆయన కృషిని గుర్తించిన ఐఎస్ఎన్... యంగ్ స్కాలర్స్ స్టీరింగ్ కమిటీ(ఐఎస్ఎన్-వైఎస్ఎస్‌సీ)కి భారత రాయబారిగా ఎంపిక చేసిందన్నారు. డాక్టర్ షేక్ చాంద్ బాషాను విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్ అభినందించారు.

సంపాదకీయం

బీజేపీ వ్యతిరేక వేదిక

ఇంతవరకు ప్రాంతీయ పార్టీగా ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితిని భారతీయ రాష్ట్ర సమితి(బి.ఆర్.ఎస్.)గా మార్చిన తరవాత ఖమ్మంలో కె.సి.ఆర్. నిర్వహించిన సభలో బీజేపీని వ్యతిరేకించే పక్షాల వేదికగా మలిచే దిశగా సాగుతున్నట్టు కనిపిస్తోంది. ఈ సమావేశానికి కేరళ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా లాంటి అనేక మంది జాతీయ స్థాయి ప్రతిపక్ష నాయకులు హాజర య్యారు. జనతా దళ్ (ఎస్) నాయకుడు హెచ్.డి. కుమారస్వామి కూడా కె.సి.ఆర్. ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరు కావలసిన వారే. కానీ ఆయన కర్నాటక అంతా ప్రచార రథ యాత్ర నిర్వహిస్తున్నందువల్ల రాలేక పోయారు. మరో వేపు రాహుల్ గాంధీ ప్రారంభించిన భారత్ జోడో యాత్ర ఈ నెల 30న కశ్మీర్ లో ముగియనుంది. దీనికి కూడా కాంగ్రెస్ పార్టీ 21 ప్రతిపక్షాల నాయకులను ఆహ్వానించింది. రాహుల్ గాంధీ యాత్ర ఉత్తరప్రదేశ్‌లో ప్రవేశించడానికి ముందుకూడా కొన్ని ప్రతిపక్ష పార్టీల నాయకులను మినహా చాలా మందిని ఈ యాత్రలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ ఆహ్వా నించింది. కానీ సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ లాంటి వారు రాహుల్ ప్రయత్నాలకు మద్దతైతే ప్రకటించారు కానీ భాగస్వాములు కాలేదు. అయితే రాహుల్ ఆహ్వానం తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావుకు లేదు. అలాగే కేజ్రీవాల్ నూ కాంగ్రెస్ ఆహ్వానించలేదు. టి.ఆర్.ఎస్.ను జాతీయ పార్టీగా మార్చి బి.ఆర్.ఎస్. ఏర్పాటు చేయడం వెనక కె.సి.ఆర్. లక్ష్యం స్పష్టంగానే కనిపిస్తోంది. అయితే జాతీయ స్థాయిలో ప్రతిపక్షాల ఐక్యత అంటే అందులో కాంగ్రెస్ కూడా ఉండాలన్న వాదన బలంగా వినిపిస్తున్న సమయంలో కె.సి.ఆర్. బుధవారం ఖమ్మంలో జరిగిన సభకు కాంగ్రెస్ ను ఆహ్వానించలేదు. కానీ విశాలమైన రీతిలో దేశ వ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకమైన ఫ్రంట్ నిర్మించడానికి కె.సి.ఆర్. ప్రయత్నిస్తున్నట్టు స్పష్టమై పోయింది. తెలంగాణలో కాంగ్రెస్ బి.ఆర్.ఎస్.ను వ్యతిరేకించే పార్టీ కావడం ఆహ్వానించకపోవడానికి కారణం కావచ్చు. అంటే ప్రతిపక్ష ఐక్యత ప్రతిపాదనలో ఇంతవరకు కనిపించిన ధోరణి కె.సి.ఆర్. ప్రణాళికలో లేదు. ప్రతిపక్ష ఐక్యత కోసం భిన్నమైన ప్రయత్నాలు జరిగాయి. బెంగాల్ లో ఘన విజయం సాధించిన తరవాత తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ ఒక ప్రయత్నం చేశారు. అదీ ప్రధానంగా బీజేపీకి వ్యతిరేకమైన ఫ్రంటే అనుకోవచ్చు. ఎందుకంటే బెంగాల్ లో కాంగ్రెస్, వామపక్షాలు కూడా తృణమూల్ ను వ్యతిరేకించేవే. బీజేపీతో తెగ తెంపులు చేసుకున్న తరవాత బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా ప్రతిపక్షాల ఐక్యతకు నడుం బిగించారు. అయితే ఆయన దృష్టిలో ప్రతిపక్షాల ఐక్యత అంటే బీజేపీని వ్యతిరేకించే పార్టీలతో కూడింది కావడమే కాక కాంగ్రెస్ కు తప్పని సరిగా స్థానం ఉండాలని వాదించేది. కె.సి.ఆర్. కు మాత్రం ప్రతిపక్షాల ఐక్యత అంటే కేవలం బీజేపీకి వ్యతిరేకమైందే కాదు, కాంగ్రెస్ ను మినహాయించేది కూడా. అంటే కేంద్రంలో నరేంద్ర మోదీ పాలనను వ్యతిరేకించే పార్టీలు అనేకం ఉన్నాయి. 2024లో మోదీని గద్దె దించాలన్న సంకల్పం ఈ పార్టీలకు ఉంది. కానీ బీజేపీని సూత్రబద్ధంగా వ్యతిరేకిస్తున్న పార్టీలే కొన్ని రాష్ట్రాలలో అధికారంలో ఉన్నాయి. రాష్ట్రాలలో అధికారంలో ఉన్న వివిధ పార్టీలకు తమ తమ రాష్ట్రాలలో కాంగ్రెస్ నుంచి పెద్ద సవాలు ఎదురవుతోంది కనక ప్రతిపక్ష ఐక్యతా యత్నాలలో భిన్న ఛాయలు కనిపిస్తున్నాయి.

బుధవారం కె.సి.ఆర్. ఏర్పాటు చేసిన ఖమ్మం సభకు హాజరైన ప్రతిపక్ష నాయకులెవరూ రాహుల్ ఆహ్వానాన్ని మన్నించలేదు. సమాపనోత్సవానికి హాజరు కావాలన్న కాంగ్రెస్ ఆహ్వానాన్ని ఎంతమంది సానుకూలంగా చూస్తారో తెలియదు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాత్రం రాహుల్ భారత్ జోడో యాత్ర సమాపనోత్సవానికి, సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు వినయ్ విశ్వంతో కలిసి హాజరవుతానని ప్రకటించారు. ఈ నిర్ణయం వెనక కచ్చితమైన బీజేపీ వ్యతిరేక వైఖరి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. రాహుల్ యాత్రను అఖిలేశ్, కేజ్రీవాల్ మన్నించకపోవడానికి వారికి కాంగ్రెస్ మీద ఉన్న విముఖతే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అయితే ఈ ఏడాది త్రిపుర శాసన సభ ఎన్నికలలో సీపీఎం, కాంగ్రెస్ కలిసి పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదీ బీజేపీని నిలవరించే ప్రయత్నాల్లో భాగమే. 2019 ఎన్నికలకు ముందు కేరళ ముఖ్యమంత్రి, సీపీఎం అగ్ర నాయకుడు పినరాయ్ విజయన్ కూడా బీజేపీయేతర, కాంగ్రెసేతర ఫ్రంట్ ఏర్పడాలన్నారు. అయితే అలాంటిది ఇంతవరకు ఏర్పడనే లేదు. 2024 ఎన్నికలలో మోదీని ఓడించడం ప్రతిపక్షాల ఉమ్మడి లక్ష్యం అయినా ఆ పని కాంగ్రెస్ తో కలిసి చేయడానికి రాష్ట్రాలలో కాంగ్రెస్ తో వైరం ఉన్న పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. స్థానిక పరిస్థితులనుబట్టి 2024 సార్వత్రిక ఎన్నికలలో ఈ కాంగ్రెస్ వ్యతిరేకత ఎలా పరిణామం చెందుతుందో ఇప్పుడే చెప్పలేం. బీజేపీని ఓడించడానికి భిన్న మార్గాలు ఏర్పడే అవకాశమూ లేకపోలేదు. ప్రతిపక్షాల ఐక్యత కోసం చొరవ చూపుతున్న కె.సి.ఆర్., మమతా బెనర్జీకి ప్రతిపక్ష ఐక్యత తమ నాయకత్వం కిందే ఉండాలనీ, అవకాశం వస్తే ప్రధానమంత్రి పదవి తమకే దక్కాలన్న ఆలోచనలు ఉన్నాయి. మనసులో ఏమున్నా నితీశ్ వైఖరి మాత్రం స్థూలంగా ప్రతిపక్ష ఐక్యత సాధించడం మీదే ఉంది. ఆయన దృష్టిలో మూడో ఫ్రంట్ ఏదీ ఉండకూడదన్న భావనే ఉంది. కానీ కె.సి.ఆర్. సమావేశానికి వచ్చిన స్పందన చూస్తే బీజేపీని వ్యతిరేకించే వారిలో రెండు శిబిరాలు ఏర్పడే అవకాశం ఉందేమో అనిపిస్తోంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు బీజేపీని మినహాయించి ప్రతిపక్ష ఐక్యత సాధ్యం కాలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ను మినహాయించి ప్రతిపక్ష ఐక్యత కుదరాలంటే మునుపటి ఇబ్బందే రావొచ్చు. వి.పి.సింగ్ ప్రభుత్వాన్ని బీజేపీ సమర్థించింది. చంద్రశేఖర్, దేవెగౌడ, ఐ.కె.గుజరాల్ ప్రధాన మంత్రులుగా ఉన్నప్పుడు వారికి కాంగ్రెస్ మద్దతు దక్కింది. మొత్తం మీద మరి కొంత కాలం గడిస్తే తప్ప స్పష్టమైన చిత్రం కనిపించేట్టు లేదు. బీజేపీని ఓడించి తీరాలి అనుకుంటే ఎక్కడికక్కడ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వ్యతిరేకత, ఐక్యత లెక్కలు తేలాల్సిందే. విద్వేష రాజకీయాలను అనుసరిస్తున్న బీజేపీని గద్దె దించి తీరాలన్న లక్ష్యం నెరవేరాలంటే స్థానిక పరిస్థితులను, సమీకరణలను గమనంలో ఉంచుకుని లక్ష్య సాధన మీదే దృష్టి నిలపవలసి వస్తుంది.

ప్రమాదాలకు నెలవులుగా రోడ్లు

ప్రపంచ దేశాల్లో అత్యధిక రోడ్డు రద్దీ ఉన్నదేశాల జాబితాలో భారత్ ముందున్నది. ఇండియాలో ఆటోమోటివ్ పరిశ్రమ దినదిన ప్రవర్ధ మానంగా వెలుగొందుతున్నది. ఎటు చూసినా వాహనాల చేంతాడంత క్యూలు కనిపిస్తున్నాయి. ఒక్క 2021లోనే దేశవ్యాప్తంగా 3 మిలియన్ల కార్ల రిజిస్ట్రేషన్లు జరిగాయంటే రహదారుల్లో వాహన శ్రేణులు చీమల దండులా నెమ్మదిగా కదులుతూ, అనేక ప్రమాదాలకు నెలవులుగా మారుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు. దక్షిణ ఆసియా దేశాల ఆటోమేటివ్‌పరిశ్రమ ప్రపంచంలో 4న అతి పెద్ద కేంద్రంగా నిలుస్తున్నది. భారతదేశంలో 5 మిలియన్ కిమీ రోడ్లు విస్తరించి 90 శాతం ప్రజారవాణా, 65 శాతం సరుకుల రవాణాకు కారణం అవుతున్నది. నవయుగంలో దినదినం కార్లు, వాహనాల సంఖ్య అనేక రెట్లు పెరగడం, ఇరుకైన రోడ్లు ఉండడం, ట్రాఫిక్ నియమాలు పాటించని వాహన చోదకుల తొందరపాటు, రద్దీ క్రమబద్ధీకరణకు సరిపోయే పోలీస్ యంత్రాంగం లేకపోవడం లాంటి వివిధ కారణాలతో భయంకర రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యం అయ్యాయి. ఈ విషయాలను సవివరంగా, విశ్లేషణాత్మకంగా కేంద్ర ప్రభుత్వం తాజా నివేదిక బహిర్గతపరుస్తున్నది. ఇటీవలే ఇండియా టీమ్ క్రికెటర్ రిషబ్ పంత్ రోడ్డు ప్రమాదం బారినపడిన నేపథ్యంలో ప్రస్తుత 'భారత్‌లో రోడ్డు ప్రమాదాలు-2021' నివేదిక ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది.

ఇటీవల కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ విడుదల చేసిన 'భారతదేశంలో రోడ్డు ప్రమాదాలు-2021 (రోడ్ ఆక్సిడెంట్స్ ఇన్ ఇండియా-2021)' నివేదిక అనేక ఆసక్తికర, ప్రమాదకర విషయాలను వెల్లడించింది. దేశవ్యాప్తంగా 2021లో 4,12,432 రోడ్డు ప్రమాదాలు జరిగాయని(నెలకు 34,369, రోజుకు 1,130), వీటిలో 1,53,972 మంది మరణించగా (రోజుకు 426 మరణాలు లేదా గంటకు 18 మరణాలు) 3,84,448 మంది గాయ పడ్డట్లు తెలుస్తున్నది. ఈ ప్రమాదాల్లో అత్యధికంగా మానవ తప్పిదాలు, రోడ్డు దుస్థితులు, వాహన కండీషన్ కారణాలుగా పేర్కొన్నారు. మితిమీరిన వాహన వేగాలే ప్రమాదాలకు ప్రధాన కారణమని, దీని వల్ల 55.9 శాతం మరణాలు, ప్రమాదకర నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల 27.5 శాతం, ప్రతికూల వాతావరణం వల్ల 3.5 శాతం, ఆల్కహాల్/డ్రగ్స్ వల్ల 1.9 శాతం, ఇంజన్ విఫలం కావడం వల్ల 1.3 శాతం, ఇతర కారణాల వల్ల 9.9 శాతం మరణాలు నమోదైయ్యాయి. రోడ్డు ప్రమాదాలకు గురైన వారిలో 67.6 శాతం మంది వయస్సు 18-45 ఏండ్లు ఉండగా, 18-60 ఏండ్ల లోపు వారు 84.5 శాతం ఉన్నారు. పట్టణ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల ప్రమాదాలు 31 శాతం నమోదు అయ్యాయి. అత్యధిక రోడ్డు ప్రమాదాలు తమిళనాడులో నమోదుకాగా, యూపీలో అత్యధికంగా మరణాలు జరిగాయి. మొత్తం ప్రమాదాల్లో 69 శాతం మరణాలు గ్రామీణ ప్రాంతాల్లో జరిగినట్లు చెబుతారు.

2021 రోడ్డు ప్రమాదాలతో పోల్చితే కరోనా విపత్తు లాక్‌డౌన్లు, క్వారంటైన్ నియమాల కారణంగా 2020లో ప్రమాదాలు (3.54 లక్షల ప్రమాదాలు, 1.33 లక్షల మరణాలు) తక్కువగా జరిగినట్లు విశ్లేషించారు. రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా జనవరి-2021 మాసంలో (40,235 ప్రమాదాలు) జరిగినట్లు అర్థం అవుతున్నది. సాయంత్రం 6:00 - 9:00గంటలమధ్య 19.9 శాతం, సాయంత్రం 3:00 - 6:00 మధ్య 17.6 శాతం ప్రమాదాలు అయినట్లు తెలుస్తున్నది. సెల్‌ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేయడం కారణంగా 1,997 రోడ్డు ప్రమాదాలు జరుగగా, 1,040 మరణాలు నమోదు కావడం దురదృష్టకరం. మ్యాన్ హోల్స్ కారణంగా 3,625 ప్రమాదాలు, 1,481 మరణాలు జరిగినట్లు తెలుస్తున్నది. సిగ్నల్ జంప్ వల్ల 555 ప్రమాదాలు, 222 మరణాలు నమోదు అయ్యాయి.

రోడ్డు ప్రమాదాల కట్టడికి బహుముఖీన కార్యాచరణ రూపొందిందని మంత్రిత్వశాఖ అమలు చేయడానికి సిద్ధపడి ఉన్నట్లు తెలిపింది. రోడ్డు భద్రత పట్ల అవగాహనలు, రోడ్లు/వాహనాలను బాగుచేయడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి కఠిన శిక్షలు వేయడం లేదా రోడ్డు భద్రత చట్టాలను అమలు చేయడం, ప్రమాదం జరిగినపుడు అత్యవసర సేవలు అందుబాటులోఉంచడం లాంటి చర్యలను చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారని తెలుస్తున్నది. అతివేగంతో వాహనాలనునడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మూలమలుపుల్లో అజాగ్రత్తలు, ట్రాఫిక్‌నిబంధనలను పాటించక పోవడం వంటి కారణాలు రోడ్డు ప్రమాదాలకు, మరణాలకు కారణమని తెలుసుకొని వాహన, రోడ్డువినియోగదారులు తగు భద్రతా నియమాలను పాటించాలని కోరుకుందాం. వేగం కన్న ప్రాణం మిన్నగా భావించి ప్రమోదకర ప్రయాణాలకు జాగ్రత్తలే రక్షణ కవచమని భావించాలి.

మధుపాళి, 9949700037

పెరిగిన కుబేరులు, పేదలు

టి.వి.సుబ్బయ్య

భారతదేశంలో కుబేరులు, పేదలు పెరుగు తున్నారు. నాలుగేళ్లనాడు 19కోట్లమంది పేదలుండగా, ప్రస్తుతం ఈ సంఖ్య 35 కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో కుబేరులు, ధనికుల వద్ద సంపద మరింత చేరింది. ఏటా కుబేరుల సంఖ్య పెరుగుతూనే ఉంది. మనది అభివృద్ధిచెందిన దేశాల్లో ఒకటన్నట్లుగా కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలోగల నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటూ ఉంది. కేవలం కుబేరులకు, ధనికులకు మాత్రమే ఆర్థిక విధానాలు అనుసరిస్తున్న మోదీ ప్రభుత్వం సాధించిన 'పురోగతి' పేదల సంఖ్యను పెంచడమే. ప్రభుత్వం చేసుకుంటున్న ప్రచారం వాస్తవంకాదని ఆక్స్‌ఫామ్ అధ్యయన నివేదిక స్పష్టం చేసింది. కోవిడ్-19 మహమ్మారి తర్వాతకాలంలో ప్రపంచంలో పెరిగిన సంపదలు 1శాతం ధనికుల వద్ద దాదాపు మూడింటరెండు వంతుల సంపద చేరిందని నివేదిక స్పష్టం చేసింది. భారతదేశంలో 1శాతం ధనికుల వద్ద దాదాపు 40 శాతం సంపన్నుల వద్దనే పోగుపడింది. గత శతాబ్దికాలంలో కుబేరుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇదే సమయంలో గత 25 ఏళ్లలో పేదలసంఖ్య అపారంగా పెరిగింది. కరోనా 2020 ప్రారంభంలో దేశంలో ప్రవేశించింది. ఆనాటి నుంచి 2022 వరకు భారతదేశంలో కుబేరుల సంఖ్య 121 శాతం పెరిగిందని, ఇదే సమయంలో గతంలో ఏనాడులేనంతగా పేదల సంఖ్య విపరీతంగా పెరిగిపోతూనే ఉంది. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వంలో కరోనా విజృంభించిన కాలంలో వలస కార్మికులకు, పేదలకు, దళితులు, ఆదివాసీలకు ఏ సహాయం అందించక పోగా కార్పొరేట్లకు దాదాపు లక్షన్నరకోట్ల రూపాయలు రాయితీలను ప్రకటించింది. పైగా వీరిపై విధిస్తున్న సంపద పన్నును 30 నుంచి 22 శాతానికి తగ్గించి మరింత సంపన్నులు కావడానికి మోదీ దోహదం చేశారు. కోవిడ్ చికిత్సను గురించి అంతగా పట్టించుకోకపోవడంతో పేదసాదలు కూడా ఉన్న ఆస్తులను సైతం తాకట్టుపెట్టి చికిత్స చేయించుకొన్నారు. ప్రైవేటు ఆస్పత్రులు రోజుకు లక్షలు, కోట్లు ఆదాయం పొందాయని అంచనాలు వెలువడ్డాయి. పైగా కార్పొరేట్ల సంపద సృష్టికర్తలని మోదీ చేసిన ప్రచారం శుద్ధ అబద్ధమని ఆక్స్‌ఫామ్ నివేదిక బైటపెట్టింది. 2021-22లో వసూలైన మొత్తం జీఎస్టీ పన్ను 14.83లక్షల కోట్లలో, దిగువస్థాయిలో గల 50 శాతం పౌరులే 62 శాతం పన్ను చెల్లించగా, టాప్‌లోగల పది శాతం ధనికులు కేవలం 3శాతం మాత్రమే చెల్లించారు.

మోదీ పాలనాకాలంలో బ్యాంకులకు బడాబాబులు చెల్లించవలసిన బకాయిలు 12 లక్షల కోట్లకుపైగా ఎగవేశారు. వీరి నుంచి మోదీ ప్రభుత్వం వసూలు చేయకపోగా ఆ మొత్తాలను రద్దుచేసి దిగువ స్థాయిలో ఉన్న ప్రజలు దాచుకున్న సొమ్మును దోపిడీ చేసిందని చెప్పడం అతిశయోక్తికాదు. ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాలే కుబేరులు, అదే సమయంలో పేదలు అపారంగా అధికం కావడానికి కారణమైంది. ఆర్థిక అసమానతలు అధిక మవుతున్న కొలదీ పేదసాదలు కష్టాలపాలవుతున్నారు. ప్రభుత్వ విధానాలను మార్చుకోవాలని ఆక్స్‌ఫాం సూచనను మోదీ లాంటి పాలకులు పట్టించుకోరు.

బహుశా ఈ విషయంలో దేశవ్యాప్తంగా చర్చించి ప్రభుత్వ విధానాలు మార్చుకోవాలని గట్టిగా కోరే పరిస్థితులు కూడా నేడు లేకుండాపోయాయి. భారత్‌లో కుబేరుల సంఖ్య 2020లో 102 ఉండగా, 2022 నాటికి 166కు పెరిగింది. టాప్‌లో ఉన్న వందమంది సంపన్నుల వద్ద 600 బిలియన్ డాలర్ల (54.12 లక్షల కోట్లు) సంపద చేరిందని నివేదిక పేర్కొంది. ఇది మన దేశ వార్షిక బడ్జెట్ కంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువ.

ఒక్క శాతం కుబేరుల వద్దకు చేరిన సంపద కంటే మిగిలిన మొత్తం జనాభా వద్దగల సంపద దాదాపు రెండున్నర రెట్లు అధికంగా ఉందని ఆక్స్‌ఫాం నివేదిక తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా కుబేరుల వద్దకు రోజుకు 270 కోట్ల డాలర్ల ఆదాయం చేరుతోంది. భారతదేశంలో ఈ పరిస్థితి ఎంతమాత్రం భిన్నంగా లేదు. పన్ను వసూలులో తేడాలు అపారంగా ఉన్నాయి. ఎలాన్‌మస్క్, అదాని, అంబానీ లాంటి కుబేరులు చెల్లించే పన్ను కేవలం దాదాపు 3 శాతం కాగా చిన్న చిన్న వ్యాపారులు చెల్లించే పన్ను దాదాపు 40 శాతం ఉంటుందని నివేదిక పేర్కొంది. కష్టించి పనిచేసే వారే అధికంగా పన్నులు చెల్లిస్తున్నారు. రైతులు, కార్మికులు కష్టపడటం ద్వారా దేశ సంపదను సృష్టిస్తున్నారన్న వాస్తవాన్ని ఈ నివేదిక ద్వారా అర్థం కావడంలేదూ..! కుబేరులకు పన్నులు తగ్గించి వారినుంచి ప్రయోజనం ఆశించడం ద్వారా వారిని మరింత సంపదపరులను చేస్తున్న పాలకులు ప్రజలను మోసగిస్తున్నారని భావించవలసి ఉంటుంది. దేశాభివృద్ధి అంటే సంపన్నుల సంఖ్యను పెంచడంలో మోదీ పెడుతున్న శ్రద్ధలో కొంతైనా సామాన్య ప్రజలను పట్టించుకున్నా కొంతైనా ఆర్థిక అసమానతలు తగ్గే అవకాశం ఉంటుంది. సమాజ పురోగతికి కీలకమైన విద్య, వైద్య రంగాలను ప్రభుత్వమే అభివృద్ధి చేస్తే ఎంతో మార్పు వస్తుంది. కీలకమైన రంగాలను ప్రైవేటీకరించడానికి వేగవంతం చేసిన మోదీ ప్రభుత్వ ఇప్పటి పాలక విధానాలు మార్చుకోకపోతే కుబేరుల సంఖ్య మరింత వేగంగా పెరుగుతుందని ఆక్స్‌ఫామ్ నివేదిక స్పష్టంగా సూచిస్తోంది.

అత్యధికంగా సంపన్నులైన ఒక శాతం మందిపై అధిక పన్నులు విధించాలని, పెట్టుబడి లాభాలపై పన్నులు పెంచాలని, వారసత్వం ఆస్తి, భూమిపై పన్ను విధించాలని, విద్య, ఆరోగ్య రంగానికి బడ్జెట్ పెంచాలని, సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని నివేదిక సూచించింది. ఈ సూచనలు పట్టించుకునే పాలకులు నేడున్నారా? టాప్ ధనవంతులైన 10 మందికి 5శాతం పెంచినా లేదా 100 మంది సంపన్నులకు 2.5శాతం పన్ను పెంచినా కనీసం రూ.1.97 లక్షల కోట్లు సమకూరుతుందని నివేదిక తెలిపింది. 2017-21 మధ్య కాలంలో కుబేరుడైన గౌతం అదానీ ఆర్జనపైన పన్ను విధిస్తే 1.79 లక్షల కోట్ల రూపాయలు లభిస్తుందని తదితర సూచనలున్నాయి. మల్టీ బిలియనీర్లపై 5శాతం పన్ను విధిస్తే, 1.7 లక్షల కోట్ల డాలర్లు లభిస్తుంది. దీనితో 200 కోట్ల మందిని పేదరికం నుంచి బైటపడవేసే అవకాశం ఉంటుందని ఆక్స్‌ఫామ్ అంచనా వేసింది. అదానీని ప్రపంచంలోనే అత్యధిక సంపన్నుడిని చేయాలనుకొనే మోదీ ఏ సూచనా పట్టించుకునే అవకాశమేలేదు.

అదేశిక సూత్రాల ఉల్లంఘన

మన దేశ రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదేశిక సూత్రాలను మోదీ ప్రభుత్వం ఉల్లంఘిస్తోంది. కొద్దిమంది వద్ద సంపద, ఉత్పత్తి వనరులు కేంద్రీకరించకుండా చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని రాజ్యాంగంలోని 39 వ ఆదేశిక సూత్రం చెప్తోంది. అలాగే ఆర్థిక, సామాజిక ప్రజాస్వామ్యాన్ని స్థాపించాలని, అసమానతలను, హోదాను, సౌకర్యాలను అవకాశాలను కల్పించాలని 38 వ ఆదేశిక సూత్రం తెలియజేస్తోంది. పౌరులందరికీ సమంగా జీవనభృతి తగినన్ని మార్గాలను ఏర్పాటు చేయాలని, మహిళలు, పురుషులకు సమాన అవకాశాలు, వేతనాలివ్వాలని 39 వ సూత్రం తెలిపింది. అలాగే పేదలకు సమాన న్యాయం, ఉచిత న్యాయ సహాయం అందించాలని, నిరుద్యోగులకు, వృద్ధులకు, అనారోగ్యులకు భద్రత కల్పించాలని ఈ సూత్రం పేర్కొంది. వీటిలో ఏ ఒక్క బాధ్యతను, గత, నేటి పాలకులు తీసుకున్న దాఖలాలేవు. పేదలే లేరని చెబుతున్న బీజేపీ ప్రభుత్వం పేదరికాన్ని తగ్గిస్తుందా?

మూఢనమ్మకాలను నిర్మూలించాలి

ఐ-మెయిల్

తనకున్న సమస్యలను తీరుస్తాడని యూపీలో ఒక మహిళ మొన్న ఒక మాంత్రికుడిని ఆశ్రయించింది. తన కొడుకుని దేవతకు బలిస్తే, ఆమెకున్న సమస్యలు తీరతాయని ఆ మాంత్రికుడు చెప్పాడు. ఆమె నాలుగేళ్ల కొడుకుని కాళికాదేవికి బలిచ్చింది. ఇది సామాన్యమైన విషయంకాదు. నవమాసాలు మోసి, ప్రాణానికి ప్రాణంగా చూసుకోవలసిన కొడుకుని తల్లి బలిచ్చిందంటే ఎంతగా ఆ తల్లి ఆవేదనపడిందో. తరుచుగా ఇటువంటి అమానుషాలు జరుగుతూనే ఉన్నాయి. ఒక చుక్క కల్వరి నూనె పుచ్చుకుంటే సకల రోగాలు మటుమాయం అని, అమాయకుల ఆదాయంలో దశమ భాగం దండుకునే చర్చి ఫాస్టర్లు జెప్పగా ఆమధ్య తూర్పుగోదావరి జిల్లాలో ముగ్గురు మహిళలు ఏసుప్రభు పిలుస్తున్నాడంటూ ఉరివేసుకుని చనిపోయారు. జుట్టో, గడ్డమో, ఏదోకటి పెంచుకొని ముఖాన వెడల్పున బూడిద పూసుకొని, మెడలో రుద్రాక్షలు వేసుకొని, కాషాయ బట్టలతో మాయల ఫకీరుల్లా బాబాల వేషం వేసుకొని కొంతమంది మోసం చేస్తున్నారు. తమ అసలపేర్లు ఏ పెంటయ్యో, పుల్లయ్యో ఉంటే కామానంద స్వామి, ప్రేమానందస్వామి, నిత్యానందస్వామి లాగా పేర్లు మార్చుకుని, ప్రజలను తమ కంత్రీమాటలతో బురిడీ కొట్టించే బాబాలు వీధి కొకడుగా తయారయ్యారు. వీరి బోధనలువిని ఈమధ్య మదనపల్లిలో బాగా చదువు కున్న తల్లిదండ్రులు తమ ఇద్దరు కుమార్తెలను అత్యంత కిరాతకంగా కొట్టి చంపారు.

ఒకవేపు మీకు జాతకాలు చెప్తాము, జీవితాలను బాగుచేస్తాం, దీర్ఘరోగాలు సైతం నయం చేస్తాము అంటూ వాస్తు జ్యోతిష్యం గాళ్ళు ప్రజలను పీక్కుతింటుంటే, మరోవేపు టీవి తెరిస్తే రంగురాళ్లు ధరిస్తే మీ ఇంటిలో లక్ష్మి తిష్టవేస్తుంది, సంఖ్యాశాస్త్రం పేరుతో పేర్లు మార్చుకుంటే కోటీశ్వరులౌతారు. మేము ఇచ్చిన రుద్రాక్షలు మెడలో వేసుకుంటే ఆకాశంలో విహరిస్తారు అంటు మోసగించే ప్రకటనలు మధ్యతరగతి ప్రజలను సర్వనాశనం చేస్తున్నాయి. ఈ రకంగా మోసం చేసేవారిని అరెస్టుచేసే బాధ్యత ప్రభుత్వానిది. కానీ ప్రభుత్వం ఆపని చేయటంలేదు. చేయకపోగా బాబాలను పెంచి పోషిస్తుంది. ప్రభుత్వ భూములు అక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తుంటె ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు వెళ్ళి ఆశ్రమాల గేట్లవద్ద కాపలా కాస్తున్నారు. వీరి బోధనలు, సూక్తులువిని అమాయక ప్రజలు వీరి మాయలోపడి ధన, మాన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు.

మొన్న నూజివీడు దగ్గర పురోహితుని అదేశం ప్రకారం, ముందుగా వరుడు ఒక మేకను వివాహం చేసుకున్నాడు. అలా చేసుకుంటే అరిష్టం పోతుందట. అలా కాకుండా పెండ్లి చేసుకుంటే, పెండ్లి కుమార్తె చనిపోతుందని చెప్పి, ముందుగా మేకను చేసుకున్నాడు. మేక చనిపోయినా పరవాలేదు. ఇంతటి ఆలోచనా రహితులుగా ఉన్న ప్రజానీకాన్ని చైతన్య పరచవలసిన బాధ్యత ప్రభుత్వంమీద ఉంది. మూఢనమ్మకాల నిర్మూలనా చట్టం చేయాలి.

-నార్నె వెంకటసుబ్బయ్య

తొలి తెలుగు ప్రజాకవి వేమన

పెనుగొండ లక్ష్మీనారాయణ

"ఆదికాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ మన తెలుగు కవులలో మహాకవులు. రచనా బాహుళ్యం వల్ల వీరిలో ఏ ఒక్కరికీ మహాకవిస్థానం సిద్ధించలేదు. తెలుగుతనానికి ప్రాతినిధ్యం వహించి, తెలుగు భాషకుగల ప్రత్యేకతను ప్రదర్శించడం వల్లనే వీరు జగద్వంద్యులయ్యారు." -శ్రీశ్రీ

సామాజిక జీవితం, తత్వాన్ని సరళంగా సహజ సుందరంగా విడమర్చి చెప్పి అజరామరకీర్తిని పొందిన వేమన తన 'ఊరు కొండవీడు ఉనికి పశ్చిమవీథి' అని చెప్పుకున్నాడు. అయినా వేమన జన్మస్థలం, కాలం విషయంలో భిన్న అభిప్రాయాలున్నాయి. "నాకు జూడగా 18వ శతాబ్ది యాదియందు వేమన్నయుండెనని యూహించుట యను కూలముగా దోచుచున్నది" అని వేమనపై, ఎంతో పరిశోధన చేసిన రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 'వేమన కాల దేశములు' వ్యాసంలో చెప్పారు. రాళ్ళపల్లి ఆ వ్యాసంలో వేమన స్థలకాలాదుల గురించి చెప్పిన విషయాలను కూడా ప్రస్తావించి తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. "ఇక కొండవీటిలో పుట్టి పెరిగినాడనుటకు వేమన పద్యములో నొక యాధారమున్నది" అని రాళ్ళపల్లి "ఊరు కొండవీడు ఉనికి పశ్చిమవీధి, మూగచింతపల్లె మొదటి యిల్లు, ఎడ్డె రెడ్డికులమదేమని తెల్పుదు" అని ఉటంకిస్తూనే "కాని దీని యర్థము సందిగ్ధము" అన్నారు. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ "ఇతడు కొండవీటిలో బుట్టినాడు కాదని సాక్షాత్ప్రమాణము లభించువరకును మనమతమందుబుట్టిన వాడేయని నమ్ముదము గాక!" అన్నారు. అయితే రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, వేమనపై విశేష పరిశోధన చేసిన ఆచార్య ఎన్.గోపి ఇద్దరూ వేమన జన్మస్థలం గురించి బ్రౌన్ చెప్పిన మాటలను ఉటంకించారు. అవి కర్నూలు జిల్లా క్రిష్టిపాడు, గుంటూరు జిల్లాకు చెందిన ఇనుకొండ, కడప జిల్లాలోని చిట్వేల్ (చిట్టివేలు). అయితే గుంటూరు జిల్లాలోని నేటి వినుకొండ నాటి 'ఇనుకొండ'. ప్రస్తుతానికి గుంటూరు జిల్లాలో 'ఇనుకొండ' అనే వూరు లేదు. (నేటి వినుకొండనే ఇనుకొండగా చెప్పి వుంటారు.) కొండవీడు రాజ్యం అంతరించిన తరువాత వేమన 'మూగచింతపల్లె' గ్రామానికి చేరి అక్కడ నివాసమేర్పరచుకున్నాడనే ఒక వాదన ఉంది. ఆ వాదనను పరిశీలిస్తే వినుకొండ సీమలో 'మూగ చింతపల్లె' అనే గ్రామం వుంది. కాబట్టి వినుకొండ (ఇనుకొండ) ప్రాంతానికి చెందినవాడు వేమన అనే అభిప్రాయం కూడా ఏర్పడుతుంది.

మొత్తంగా వేమనకు కొండవీడు ద్వారా గుంటూరుసీమతో సంబంధం వుందనే విషయాన్ని పరిశోధకులు ప్రస్తావించారు కాబట్టి వేమన గుంటూరు సాహిత్య చరిత్రలో భాగమవుతున్నారు. వేమన అంధ మూఢ విశ్వాసాలను నిరసించాడు. 'కులము ఘనము గాదు, గుణము ఘనంబు' అంటూ కులాన్ని తిరస్కరించాడు. బ్రాహ్మణ భావజాలం, అగ్రవర్ణ దురహంకారంపై దండెత్తాడు. గొప్ప సంస్కరణ దృష్టిని ప్రసరించాడు. అట్టడుగు వర్గాలు, కష్టజీవుల పక్షం వహించాడు. ప్రశ్నించటం అనేది వేమన సమాజానికి అందించిన గొప్ప అస్త్రం.

రాతి బొమ్మకేల రంగైన వలువలు
గుళ్ళు గోపురములు కుంభములును,
కూడుగుడ్డ దాను గోరునా దేవుడు...?
విశ్వదాభిరామ వినురవేమ

విప్రులెల్ల జేరి వెఱ్ఱికూతలు గూసి
సతిపతులను గూర్చి సమ్మతమున
మును ముహూర్తముంచ ముండెట్లు మోసెరా...?

పాల సంద్రమందు పవ్వళించినవాడు
గొల్లయిండ్ల పాలు కోరనేల?
ఎదుటివారి సొమ్ములెల్ల వారికి తీపు

భూమి నాదియన్న భూమి పక్కున నవ్వు
దానహీను చూసి ధనము నవ్వు
కదనభీరు చూసి కాలుండు నవ్వురా

విత్తము గలవాని వీపున బుండైన
వసుధలోన జాల వార్తకెక్కు
బీదవాని యింట బెండ్లైన నెఱుగరు అన్నాడు వేమన. వేమన తెలుగు సమాజంపై కలిగించిన ప్రభావం నాటికీ నేటికీ అపరిమితం.

అతను అజరామరుడు. తెలుగునాట తొలి ప్రజాకవి. వేమన అసలు పేరు పైడిపాల పుల్లారెడ్డి అని ప్రచారంలో వుంది. గోపి అన్నట్లు 'వేమన్నా! వేమన్నా! ఎక్కడున్నావ్? అంటే మీ అందరి నాలుకలపైన అనేది సమాధానం.'

'ఆటవెలదిని ఈటెగా విసిరిన దిట్ట ఛాందసభావాలకు తొలి అడ్డుకట్ట' అని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై నెలకొల్పిన వేమన విగ్రహం వద్ద రాసిన కవితాత్మక వాక్యాలివి.

గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలో 1947 లోనే గ్రామస్తులు వేమన విగ్రహాన్ని నెలకొల్పారు. గుంటూరు జిల్లా చుండూరు మండలం మోదుకూరు గ్రామంలో మొవ్వా వీరారెడ్డి వేమన సాహిత్యోత్సవాలను చాలాకాలం నిర్వహించారు. మరుపూరి కోదండరామిరెడ్డి, సంజీవదేవ్ వంటి పలువురు ప్రముఖ సాహితీవేత్తలను ఆహ్వానించి వారిచేత ఆరుద్ర, వేమన జీవితం సాహిత్యంపై ప్రసంగాలు యిప్పించారు. అదే గ్రామానికి చెందిన ప్రసిద్ధ సాహితీవేత్త దుర్గానంద్ (చక్రాల దుర్గానందరాజు) ఆ కార్యక్రమ నిర్వహణలో సహకరించటమే గాక 'శబ్దగాండీవి వేమన' శీర్షికన ప్రసంగాలిచ్చారు కూడా. దుర్గానంద్ ప్రసంగ వ్యాసాలను వీరారెడ్డి కుమారుడు శ్రీనివాసరెడ్డి అందించటంతో సామల రమేష్‌బాబు సంపాదకత్వంలోని 'అమ్మ నుడి' మాసపత్రిక ఐదు నెలలపాటు ఫిబ్రవరి 2019 వరకూ ప్రచురించింది. అమ్మనుడి కార్యక్రమాలలోని మరికొందరి ప్రసంగాలను కూడా వ్యాస రూపంలో సమర్పించింది. గుంటూరుకు చెందిన గొడవర్తి వెంకట సుబ్రహ్మణ్యం 'వేమన బోధ' (వ్యక్తిత్వ సామాజిక యోగ, ఆధ్యాత్మిక విశ్లేషణ) పేరిట డిసెంబర్ 2013లో ఒక పుస్తకాన్ని పాఠకులకు అందించారు.

"సంఘ సంస్కర్తవై దురాచార విష వి
దగ్ధ జగతికి నూత్న చైతన్య మొసగి
త్రోవ చూపించినావు ముందునకు నీవు-
మంచి మొనగాడవయ్య! వేమన కవీంద్ర!" -కరుణశ్రీ

-అరసం జాతీయ కార్యదర్శి

కేంద్రంతో కేజ్రీవాల్ సర్కార్ ఢీ

అధికార హద్దు గుర్తించాలన్న ఆప్

వాడివేడి వాదనలు

తీర్పు రిజర్వు చేసిన సుప్రీంకోర్టు

న్యూదిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ నేతృత్వంలోని దిల్లీ ప్రభుత్వం బుధవారం సర్వీసుల నియంత్రణపై కేంద్రంతో తన అధికారాన్ని స్పష్టంగా గుర్తించాలని కోరగా, దీనిపై సుప్రీంకోర్టు తన తీర్పును రిజర్వు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం తన తీర్పును రిజర్వు చేయడానికి ముందు దాదాపు నాలుగైదు రోజుల పాటు కేంద్రం, దిల్లీ ప్రభుత్వాల తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వీ వాదనలు వినిపించారు. విచారణ ప్రారంభంలో న్యాయమూర్తులు ఎంఆర్ షా, కృష్ణ మురారి, హిమా కోహ్లీ, పీఎస్ నరసింహతో కూడిన ధర్మాసనం సొలిసిటర్ జనరల్ కొన్ని ఒప్పించే వాదనల తర్వాత, దిల్లీ-కేంద్రం అధికార వివాదం తొమ్మిది లేదా అంతకంటే ఎక్కువ మంది న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనానికి కేంద్రం తరపున అదనపు వాదనలు చేయడానికి అనుమతించింది. కాగా సింఘ్వీ తన వాదనను పున: ప్రారంభిస్తూ, 'ఈసారి నలుపు, తెలుపు రంగులలో హద్దులు స్పష్టంగా గుర్తించబడతాయని ఆశిస్తున్నాను' అని అన్నారు. దిల్లీలో సివిల్ సర్వీసెస్ బోర్డు ఉనికి దేశ రాజధాని ఇతర కేంద్రపాలిత ప్రాంతాలు (యూటీలు)తో సమాన స్థాయిలో లేదని, అలాంటి సేవల బోర్డులు లేనివని ఆయన అన్నారు. 'దేశ రాజధానిని హైజాక్ చేస్తున్నట్లు ఒక చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. మరోవైపు పార్లమెంటును కేంద్ర ప్రభుత్వంతో సమం చేయడం సమస్య. పార్లమెంటు ఏదైనా చట్టాన్ని చేయవచ్చు కానీ ఇక్కడ అది సేవలపై కార్యనిర్వాహక నోటిఫికేషన్ (ఇది సవాలులో) ఉంది' అని ఆయన తన వాదనలను ముగించారు. అయితే తన వాదనలకు ముందు, సొలిసిటర్ జనరల్ దిల్లీ ప్రభుత్వానికి ఎటువంటి అధికారాలు లేవని, 'రూపొందించిన అవగాహన' సృష్టించబడిందని తెలిపారు. 'నా ప్రాథమిక సమర్పణలు ఏమిటంటే, మనం దేశ రాజధానితో వ్యవహరిస్తున్నాము. దాని పరిపాలనలో కేంద్ర ప్రభుత్వం చాలా పెద్ద పాత్ర పోషిస్తుందనే వాస్తవాన్ని మనం కోల్పోలేము' అని తెలిపారు. కేంద్రపాలిత ప్రాంతాలు (యూటీలు) కు సేవలు, వాటిపై నియంత్రణ అస్సలు వర్తించదని ఆయన అన్నారు. 'కేంద్ర పాలిత ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇది కేంద్రం పొడిగింపు. అందువల్ల, కేంద్రం, దాని విస్తరించిన ప్రాంతం మధ్య సమాఖ్య అనే భావన లేదు' అని ఆయన చెప్పారు. ఇదిలాఉండగా, 'అధికార వికేంద్రీకరణ'కు 'పంచాయతీలు' కూడా ఉదాహరణ అయినందున సమాఖ్య భావన కేంద్రపాలిత ప్రాంతానికి వర్తించదని కేంద్రం చేసిన వాదనలను అంగీకరించడం కష్టంగా ఉంది' అని సుప్రీంకోర్టు మంగళవారం వ్యాఖ్యానించింది. 'సమాఖ్య రాష్ట్రాలు, కేంద్రం ప్రభుత్వానికి మాత్రమే వర్తిస్తుందని మీ (కేంద్రం) వాదనను అంగీకరించడం కష్టంగా ఉండవచ్చు. కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్రం మధ్య భిన్నమైన సమాఖ్య ఉండవచ్చు. ఇది సమాఖ్య అన్ని లక్షణాలను కలిగి ఉండకపోవచ్చు, కానీ కొన్ని కలిగి ఉండవచ్చు' అని పేర్కొంది. కేంద్ర పాలిత ప్రాంతాలలో సంబంధాలలో కూడా సమాఖ్యకు సంబంధించిన కొన్ని లక్షణాలు ప్రబలంగా ఉన్నాయి. 'పంచాయతీ'లలో కూడా సమాఖ్య భావన స్థానిక ప్రభుత్వ అవసరాన్ని, అధికార వికేంద్రీకరణను ప్రతిబింబిస్తుంది' అని ధర్మాసనం పేర్కొంది. సింఘ్వీ మాట్లాడుతూ 'నేను రాష్ట్ర జాబితాలోని ఎంట్రీ 41 (రాష్ట్ర ప్రజా సేవలు- రాష్ట్ర ప్రజా సేవల కమిషన్)లో నా శాసన హక్కులను న్యాయబద్ధంగా కోరుతున్నాను. నేను రాష్ట్ర జాబితాలోని అన్ని ఎంట్రీల క్రింద మూడు ఎంట్రీలు (పబ్లిక్ ఆర్డర్, పోలీసు, ల్యాండ్) మినహా కింద నా అన్ని శాసన హక్కులను కోరుతున్నాను. దిల్లీ శాసనసభ చట్టాలను రూపొందించే సామర్థ్యం ఉన్న రాష్ట్ర జాబితా కింద ఉన్న ఎంట్రీలకు సంబంధించి తాను అన్ని కార్యనిర్వాహక అధికారాలను కోరుతున్నాను' అని చెప్పారు. దేశ రాజధానిలో సేవల నియంత్రణ అంశంపై దిల్లీ ప్రభుత్వం స్పష్టత కోరుతుందని, ఈ వివాదం పునరావృతం కావడం ఈ కోర్టుకు కూడా ఇష్టం లేదని ఆయన అన్నారు. మునుపటి విచారణలలో ఒకదానిలో, సుప్రీంకోర్టు... 'సమష్టి బాధ్యత, సహాయం, సలహాని 'ప్రజాస్వామ్యానికి మూలాధారాలు' అని పేర్కొంటూ సేవలపై నియంత్రణ కేంద్రం లేదా దిల్లీ వద్ద ఉండాలా వద్దా లేదా మధ్యస్థం కనుగొనాలని తెలిపింది. దిల్లీలో సేవల నియంత్రణపై కేంద్రం, జాతీయ రాజధాని ప్రాంత ప్రభుత్వం శాసన, కార్యనిర్వాహక అధికారాల పరిధికి సంబంధించిన చట్టపరమైన సమస్యను విచారించడానికి రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటయింది.

ప్రభుత్వ పనిలో ఎల్జీ జోక్యం తగదు: సిసోడియా

న్యూదిల్లీ: లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా విమర్శించారు. ప్రజలెన్నుకున్న ప్రభుత్వ పనిలో జోక్యం చేసుకోవడం ద్వారా ఎల్జీ కేంద్రంలోని పెద్దలను సంతోష పెట్టాలని చూస్తున్నారన్నారు. దిల్లీ అసెంబ్లీ సెషన్ మూడవరోజు సిసోడియా ప్రసంగిస్తూ... లెఫ్టినెంట్ గవర్నర్ లేదా పాలనాధికారి ఎన్నికైన ప్రభుత్వానికి మార్గదర్శకత్వం, సలహాలు ఇచ్చేందుకు కట్టుబడాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. అయితే సలహాలు ఇవ్వడాన్ని పక్కనబెడితే కనీసం ప్రభుత్వాన్ని కూడా సంప్రదించడం లేదని, ఇటువంటి వైఖరిని దేశంలో మొదటిసారి చూస్తున్నామని అన్నారు. రాజ్యాంగం ప్రకారం... స్థానిక పాలనపై నిర్ణయం తీసుకోవాల్సింది రాష్ట్రాలే తప్ప కేంద్రం కాదు. దిల్లీ ఎల్జీ రాజ్యాంగాన్ని లేదా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం నిర్ణయాన్ని పాటించడం లేదని సిసోడియా పేర్కొన్నారు. ఎల్జీ వీకే సక్సేనా అధికారాలపై ఆప్, బీజేపీ మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. 'తన బిగ్ బాస్‌ను ప్రసన్నం చేసుకోవడానికి గిరిజన అధిపతిలా ప్రవర్తించవద్దని, రాజ్యాంగాన్ని అనుసరించాలని నేను దిల్లీ ఎల్జీని కోరుతున్నాను' అని సిసోడియా అన్నారు. దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆల్డర్‌మన్‌లను ఎల్జీ సిఫార్సు చేయడం రాజ్యాంగ విరుద్ధం అని సిసోడియా స్పష్టం చేశారు. శాంతిభద్రతలు, దిల్లీ పోలీసులు, భూ ఆక్రమణలపై దృష్టి పెట్టే బదులు ఎన్నికైన ప్రభుత్వ పనిలో ఎల్జీ జోక్యం చేసుకుంటున్నారని ఆయన అసహనం వ్యక్తం చేశారు.

జనాభాలో మనమే టాప్

చైనాను అధిగమించిన భారత్

న్యూదిల్లీ: ప్రపంచంలో అత్యంత జనాభా కలిగిన చైనాలో జననాల రేటు తగ్గినట్లు ఇటీవల నివేదికలు వెల్లడించాయి. ఈ తరుణంలో చైనా జనాభాను భారత్ ఇప్పటికే దాటేసి ఉండవచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. వరల్డ్ పాపులేషన్ రివ్యూ అంచనాల ప్రకారం.. 2022 చివరినాటికే భారత్ జనాభా 141.7కోట్లు కాగా తాజాగా (జనవరి 18, 2023 నాటికి) ఈ సంఖ్య 142.3 కోట్లుకు చేరుకున్నట్లు అంచనా. మరో అంతర్జాతీయ మార్కెట్ పరిశోధక సంస్థ మాక్రో ట్రెండ్స్ కూడా ప్రస్తుతం భారత జనాభా 142.8కోట్లుగా లెక్క కట్టింది.

ఇవి చైనా ఇటీవల ప్రకటించిన జనాభా (141.2కోట్లు) కంటే ఎక్కువ. దీంతో ప్రపంచంలోనే అత్యంత జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించినట్లేనని స్పష్టమవుతోంది. జననాల రేటు తగ్గుతుండటం.. వయోవృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో తమ జనాభా ఇటీవలి కాలంలో తొలిసారిగా తగ్గినట్లు చైనా ప్రకటించింది. 2021 కంటే 2022 చివరినాటికి తమ దేశ జనాభా 8.50 లక్షలు తగ్గిందని అక్కడి నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (ఎన్‌బీఎస్) జనవరి 17న తెలిపింది. ప్రస్తుతం అక్కడ మొత్తం జనాభా 141.18 కోట్లుగా ఖరారు చేసింది. అయితే, భారత్ 2023 చివరి నాటికి ఈ రికార్డును చేరుకుంటుందని ఐక్యరాజ్యసమితి ఇదివరకు అంచనా వేసినప్పటికీ.. అంతకుముందే భారత్ ఈ రికార్డును అధిగమించినట్లు తెలుస్తోంది. 2050 నాటికి భారత జనాభా సుమారు 167 కోట్లకు చేరుకోవచ్చని ఐరాస అంచనా వేస్తోంది. మరోవైపు ప్రపంచ జనాభా కూడా ఇటీవలే 800 కోట్ల మైలురాయిని దాటింది. 2022 నవంబర్ 15 రోజున పుట్టిన శిశువుతో జనాభా 800 కోట్లకు చేరుకుందని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. 1974లో ప్రపంచ జనాభా 400 కోట్లుగా ఉండగా.. 48ఏళ్లలోనే అది రెట్టింపై 800 కోట్లకు చేరుకుంది. వైద్యం సహా అనేక రంగాల్లో మానవాళి సాధించిన పురోగతి వల్ల అకాల మరణాలు తగ్గడం, ఆయుర్దాయం పెరగడం జనాభా పెరుగుదలకు ప్రధాన కారణమని ఐరాస వెల్లడించింది.

పంజాబ్ కాంగ్రెస్ నేత రాజీనామా

వెంటనే బీజేపీలో చేరిక

చండీగఢ్/న్యూదిల్లీ: పంజాబ్ కాంగ్రెస్ నేత, మాజీ ఆర్థికమంత్రి మన్‌ప్రీత్ సింగ్ బాదల్ బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. గంటల వ్యవధిలోనే దిల్లీలోని బీజేపీ కార్యాలయంలో కాషాయ కండువా కప్పుకున్నారు. కేంద్రమంత్రి పీయూశ్ గోయల్, ఇతర నాయకుల సమక్షంలో బాదల్ బీజేపీలో చేరారు. బాదల్ తన రాజీనామా లేఖను ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీకి పంపారు. పార్టీలో వర్గపోరు తీవ్రంగా ఉందని లేఖలో ఆరోపించారు. దిల్లీలోని కోటరీయే పంజాబ్‌లో వ్యవహారాలు చక్కబెడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు నిర్వహించే తీరు, నిర్ణయాలు తీసుకునే పద్ధతి, మరీ ముఖ్యంగా పంజాబ్ విషయంలో వ్యవహరిస్తున్న తీరు తనను తీవ్ర నిరాశకు గురిచేస్తోందని, ఇలా చెప్పడం చాలా చిన్న మాట అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దిల్లీలోని పార్టీ అధిష్ఠానం ఆదేశాలను పంజాబ్ పార్టీ విభాగం పాటించే విధంగా చేయడానికి నిర్దేశించిన కోటరీ సమర్థవంతమైనది కాదని ఆరోపించారు. ఇప్పటికే తలో దారిలో నడుస్తున్న పార్టీ నేతల మధ్య విభేదాలు తగ్గించడానికి ప్రయత్నించడానికి బదులుగా, ఈ కోటరీ పెద్దలు వర్గపోరును మరింత పెంచడానికి కృషి చేస్తున్నారన్నారు. పార్టీలోని అత్యంత చెడ్డవారిని బలోపేతం చేయడాన్ని ఓ విధానంగా మార్చుకున్నారని మండిపడ్డారు. పార్టీలో తాను తీవ్ర అవమానాలకు గురయ్యానన్నారు. బాదల్ రాజీనామా అనంతరం పంజాబ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా వారింగ్ స్పందిస్తూ బాదల్‌కు అధికార దాహం ఉందన్నారు. కాంగ్రెస్ అధికారం చేపడుతుందని భావించి ఆయన పార్టీలో చేరారన్నారు. ఆయనలాంటివారు ఐదేళ్లపాటు అధికారానికి దూరంగా ఉండటం కష్టమన్నారు. ఏడవడానికి బదులుగా, కాంగ్రెస్‌కు ద్రోహం చేసినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పంజాబ్ మాజీ సీఎం ప్రకాశ్ సింగ్ బాదల్‌కు మన్‌ప్రీత్ బాదల్ సమీప బంధువు. రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో యాత్రలో మన్‌ప్రీత్ పాల్గొనడం లేదు. అమరేందర్ సింగ్ రాజాతో ఆయనకు సన్నిహిత సంబంధాలు లేకపోవడమే దీనికి కారణమని తెలుస్తోంది.

సినిమాలపై అనవసర వ్యాఖ్యలొద్దు: మోదీ

న్యూదిల్లీ: సినిమాల విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ బీజేపీ నాయకులకు కీలక సూచనలు చేశారు. అసంబద్ధ విషయాలపై అనవసర వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని పార్టీ నేతలకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో మోదీ ఈ మేరకు సూచనలు చేసినట్లు కేంద్ర మైనార్టీ శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ తెలిపారు. దేశ రాజధాని దిల్లీలో రెండు రోజుల పాటు జరిగిన ఈ సమావేశాలు మంగళవారం ముగిశాయి. ఈ సభల్లో కీలక ప్రసంగం చేసిన ప్రధాని మోదీ.. 2024 సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా అనేక అంశాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ 'దేశ అభివృద్ధి కోసం రాత్రి పగలూ మనమంతా కష్టపడుతున్నాం. కానీ మనలో కొందరు సినిమాల వంటి సంబంధం లేని అంశాలపై అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారు. అవి టీవీల్లో పదే పదే ప్రసారమవుతున్నాయి. దీంతో పార్టీ అభివృద్ధి అజెండా పక్కకు పోతోంది. అందుకే అలాంటి అనవసర వ్యాఖ్యలు చేయడం మానుకోవాలి' అని పార్టీ నేతలకు ప్రధాని గట్టిగా చెప్పారు. 2024 జాతీయ ఎన్నికలకు కేవలం 400 రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున, పార్టీ సభ్యులు ప్రతి విభాగానికి సేవ చేయాలి కానీ ప్రతిఫలంగా ఓట్లను ఆశించకూడదని మోదీ వారికి సూచించారు.ఓట్లు ఆశించకుండా పస్మాంద ముస్లింలు, బోహ్రా కమ్యూనిటీలు, ముస్లిం వృత్తి నిపుణులు, విద్యావంతులైన ముస్లింలను కలవాలని ప్రధాని బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

రాహుల్ ప్రధాని అభ్యర్థి కావచ్చు

- 'జోడో యాత్ర'తో కాంగ్రెస్‌లో తాజా శ్వాస నింపాడు
- ప్రతిపక్ష ఐక్యత కోసం మా పార్టీ కృషి చేస్తుంది
- సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య

న్యూదిల్లీ : రాహుల్ గాంధీ తన భారత్ జోడో యాత్ర ద్వారా కాంగ్రెస్‌ను పునరుద్ధరించారని, వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థి కావచ్చని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య మంగళవారం అన్నారు. 'రాహుల్ గాంధీ తన భారత్ జోడో యాత్ర ద్వారా కాంగ్రెస్‌ను పునరుద్ధరించారు. ఆయన దానిలో తాజా శ్వాసను నింపాడు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఆయన ప్రధాన మంత్రి అభ్యర్థి కూడా కావచ్చు' అని భట్టాచార్య అన్నారు. 'బీజేపీ స్పందనను బట్టి రాహుల్ యాత్ర విజయవంతమైందని చెప్పవచ్చు. దాని వల్ల కొత్త సమస్యలు వస్తున్నాయి. దానికి ప్రజలు మద్దతు పలికారు. ఇంతవరకు అంతా బాగానే ఉంది' అని తెలిపారు. ఫిబ్రవరి 15 నుంచి 20 వరకు జరగనున్న తన పార్టీ 11వ కాంగ్రెస్ సన్నాహాలను పర్యవేక్షించడానికి భట్టాచార్య పాట్నాలో ఉన్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రతిపక్ష అభ్యర్థిగా ప్రధాన మంత్రిగా నిలిచే అవకాశం గురించి అడిగిన ప్రశ్నకు, తాను ఎవరినీ తోసిపుచ్చబోనని భట్టాచార్య అన్నారు. 'వేర్వేరు వ్యక్తులు నితీశ్‌కు భిన్నమైన పాత్రలను ఊహించారు. ఒకప్పుడు (1970లలో) నాయకులకు మార్గదర్శకత్వం వహించిన జయప్రకాశ్ నారాయణ్ పోషించిన పాత్రను కొందరు అతని కోసం చూస్తారు. కొందరు ఆయనను ప్రధాన మంత్రి పాత్రలో పోషించాలని చూస్తున్నారు. మేము ఎవరినీ విస్మరించడం లేదు' అని తెలిపారు. బీజేపీ వ్యతిరేక వేదికపైకి వచ్చే అవకాశం, ఆవశ్యకత గురించి చర్చించడానికి సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ సదస్సు సందర్భంగా ఎన్‌డీఏ యేతర పార్టీల నాయకులను సమావేశానికి ఆహ్వానించడం ద్వారా ప్రతిపక్ష ఐక్యత కోసం తమ పార్టీ తన వంతు కృషి చేస్తుందని భట్టాచార్య చెప్పారు. 'ప్రతిపక్ష పార్టీలన్నీ ఇప్పుడు వీధుల్లోకి వచ్చాయి, ఇది మంచి సంకేతం. వారి ఐక్యత వివిధ కోణాలను కలిగి ఉండవచ్చు. ఇది గట్టి, సన్నిహిత ఐక్యతకు బదులుగా విదేశాల ఆధారిత ఐక్యత కావచ్చు' అని అన్నారు. 'ఇది ఎన్నికలకు ముందు లేదా ఎన్నికల తర్వాత కూటమి కావచ్చు లేదా రెండింటి మిశ్రమం కావచ్చు. బహుళ-పార్టీ, బహుళ-నాయకుల కూటమి దాని బలహీనతకు బదులుగా ప్రతిపక్షానికి బలం అవుతుంది' అని తెలిపారు.

'తేజస్వీ సూర్య పొరపాటున చేశారు'

ఎమర్జెన్సీ డోర్ ఘటనపై సింధియా సమర్థన

బెంగళూరు: ఇండిగో విమానంలో అత్యవసర మార్గం తలుపుల్ని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య తెరిచినట్లు వచ్చిన ఘటనపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పందించారు. ఈ ఘటనను ధ్రువీకరించిన ఆయన తేజస్వీ సూర్య పొరపాటునే ఆ తలుపుల్ని తెరిచారన్నారు. ఘటన అనంతరం విస్తృతంగా తనిఖీలు జరిగాయని, ఆ తర్వాత విమానం గమ్యస్థానానికి బయల్దేరిందని సింధియా తెలిపారు. చెన్నై-తిరుచ్చి ఇండిగో విమానంలో గతనెల 10న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. తమ విమానంలో ఓ ప్రయాణికుడు ఎమర్జెన్సీ ఎగ్జిట్‌ను తెరిచారని ఇండిగో మంగళవారం పేర్కొంది. ఆ ప్రయాణికుడు క్షమాపణ చెప్పినట్లు తెలిపింది. ఆ ప్రయాణికుడు ఎవరో కాదు బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యనేనని కాంగ్రెస్ బయటపెట్టింది. టేకాఫ్‌కు ముందే ఈ ఘటన జరగడం వల్ల ప్రమాదం తప్పిందనీ లేదంటే ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లి ఉండేదని పేర్కొంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దాచిపెట్టిందని దుయ్యబట్టింది. దీనిపై పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ స్పందిస్తూ ఈ ఘటన తమ దృష్టికి వచ్చిందని, భద్రతాపరమైన లోపాలేమీ లేవని పేర్కొంది.

ఐదుగురు మేఘాలయ ఎమ్మెల్యేల రాజీనామా

షిల్లాంగ్: మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన మంత్రి, నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. తమ రాజీనామాను బుధవారం గవర్నరుకు సమర్పించి యునైటెడ్ డెమోక్రటిక్ పార్టీలో(యుడీపీ) చేరేందుకు సిద్ధమయ్యారు. రాజీనామా చేసిన వారిలో కేబినెట్ మంత్రి హిల్ స్టేట్ పీపుల్ డెమోక్రటిక్ పార్టీ(హెచ్‌ఎస్‌పీడీపీ) ఎమ్మెల్యే రెనిక్టన్ లింగ్‌డో టోంగ్‌కార్, తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే షిట్లాంగ్ పాలే, సస్పెండెడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మైరల్‌బోర్న్ సియోమ్, పిటి సాక్మీతో పాటు ఓ స్వతంత్ర ఎమ్మెల్యే ఉన్నారు. ఈ పరిణామంతో రాష్ట్రంలో కాంగ్రెస్, హెచ్‌ఎస్‌పీడీపీ పార్టీలకు ఎమ్మెల్యేలు లేకుండా పోయారు. మేఘాలయలో ఈమధ్య కాలంలో పార్టీ ఫిరాయింపులు అధికమయ్యాయి. ఇప్పటి వరకు దాదాపు 18 మంది శాసనసభ్యులు సంబంధిత పార్టీలకు రాజీనామాలు సమర్పించారు.

నోట్ల కట్టలతో అసెంబ్లీలో ఆప్ ఎమ్మెల్యే

న్యూదిల్లీ: అధికార ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే మహేందర్ గోయల్ బుధవారం అసెంబ్లీలో కలకలం సృష్టించారు. సిటీ గవర్నమెంట్ ఆసుపత్రికి చెందిన ప్రైవేటు కాంట్రాక్టరు ఒకరు తనకు లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారని ఆరోపిస్తూ నోట్ల కట్టలు తీసి సభలో చూపించారు. రోహిణిలోని బాబాసాహెబ్ అంబేద్కర్ ఆసుపత్రిలో తాత్కాలిక స్టాఫ్ నియామకాల్లో అవకతకలు చోటుచేసుకున్నట్టు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. కొందరు పలుకుబడి గల వ్యక్తులు తన నోరు మూయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తన ప్రాణలకు ముప్పు ఉందని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఎలాంటి బెదిరింపులకు తాను భయపడేది లేదన్నారు. లంచం ఇచ్చేందుకు ప్రయత్నించిన ప్రైవేటు కాంట్రాక్టరుపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తనకు రక్షణ కావాలని, తన జీవితం ప్రమాదంలో పడిందని సభకు తెలిపారు. దీనిపై స్పీకర్ వెంటనే స్పందించారు. ఇది చాలా తీవ్రమైన అంశమని పేర్కొంటూ ఎమ్మెల్యే ఫిర్యాదును పిటిషన్స్ కమిటీ ఆఫ్ హౌస్‌కు అప్పగించారు.

'మహా' మండలి ఎన్నికలపై

ఎంవీఏలో గందరగోళం

ముంబై : మహారాష్ట్ర రాష్ట్ర శాసన మండలి ద్వైవార్షిక ఎన్నికలకు నామినేషన్ల సమర్పణ ద్వారా మహా వికాస్ అగాది (ఎంవీఏ) లో వైరుధ్యాలు బయటపడ్డాయి. నాసిక్ డివిజన్ గ్రాడ్యుయేట్ల స్థానానికి డాక్టర్ సుధీర్ తంబే అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టింది. అయితే చివరి నిమిషంలో ఆయన తన కుమారుడు సత్యజీత్ తాంబేకు ఉత్తమ మార్గం సుగమం చేయడానికి నామినేషన్లను దాఖలు చేయడానికి నిరాకరించారు. సాంకేతిక కారణాలను చూపుతూ సత్యజీత్ నిష్పక్షపాతంగా తన నామినేషన్లను దాఖలు చేశారు. కాంగ్రెస్ పరాజయం తర్వాత, శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే) ఎంవీఏ కూటమి సహచరుడిని సంప్రదించకుండా, ఇదే విధమైన నాసిక్ డివిజన్ గ్రాడ్యుయేట్ సీటుకు నిష్పాక్షిక అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన శుభాంగి పాటిల్‌కు తమ సహాయాన్ని ప్రకటించారు. ప్రతిపక్ష నాయకుడు అజిత్ పవార్ మాట్లాడుతూ 'మేము ఇతర కూటమి భాగస్వాములతో మాట్లాడుతున్నాము. ఇప్పుడు సుధీర్‌ను కాంగ్రెస్ సస్పెండ్ చేసిందని, సత్యజిత్‌పై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టమవుతోంది. మేము మద్దతును అందించడానికి కొత్త అభ్యర్థులను కనుగొనవలసి ఉంది. స్వతంత్ర అభ్యర్థులందరూ నామినేషన్లను ఉపసంహరించుకుంటారని, ఒక అభ్యర్థికి మాత్రమే మద్దతు ఇస్తారని మేము ఆశిస్తున్నాము' అని తెలిపారు.

నవాబ్ మాలిక్ కుమారుడు, కోడలిపై కేసు

ముంబై : తన వీసా దరఖాస్తులో నకిలీ పత్రాలు సమర్పించినట్లుగా వచ్చిన ఆరోపణలపై మహారాష్ట్ర మాజీ మంత్రి నవాబ్ మాలిక్ కుమారుడు, అతని రెండవ భార్యపై ముంబై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఒక అధికారి బుధవారం తెలిపారు. విదేశీయుల ప్రాంతీయ నమోదు కార్యాలయం (ఎఫ్‌ఆర్‌ఆర్‌వో) పరిశీలనలో ఫరాజ్ మాలిక్, అతని భార్య హామ్లిన్ సమర్పించిన పత్రాలు నకిలీవని తేలింది. దీని గురించి ఎఫ్‌ఆర్‌ఆర్‌ఓ ఇక్కడ కుర్లా పోలీసులకు సమాచారం అందించినట్లు ఆయన చెప్పారు. ప్రాథమిక సమాచారం ఆధారంగా, పోలీసులు ఫరాజ్ మాలిక్, అతని భార్యపై 420 (మోసం), 465 (ఫోర్జరీ), 468 (మోసం కోసం ఫోర్జరీ), 471 (ఒక నకిలీ పత్రాన్ని నిజమైన పత్రంగా ఉపయోగించడం), 34 (సాధారణ ఉద్దేశం), విదేశీయుల చట్టంలోని నిబంధనలు సహా భారత నేర శిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్ల కింద మంగళవారం అర్ధరాత్రి ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు వివరించారు.

మూడు లారీల్లో ఒడిశాకు 'బీజూ' విమానం

భువనేశ్వర్: ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ తండ్రి బీజూ పట్నాయక్ గతంలో వినియోగించిన డకోటా విమానాన్ని మూడు లారీల్లో తరలించారు. భువనేశ్వర్‌లోని బీజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ విమానాన్ని ఉంచుతారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) దీనికోసం 1.1 ఎకరాల భూమి కేటాయించింది. బీజూ పట్నాయక్ ఒడిశా మాజీ ముఖ్యమంత్రి. ఆయన బ్రిటిష్ హయాంలో రాయల్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో పైలట్‌గా పనిచేశారు. కోల్‌కతా ప్రధాన కార్యాలయంగా కళింగ ఎయిర్‌లైన్స్‌ను స్థాపించారు. స్వాతంత్ర సమరయోధులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రహస్యంగా తరలించారు. 1947 ఏప్రిల్‌లో అప్పటి ఇండోనేషియా ప్రధాని సుతాన్ సజ్రహీర్‌ను రక్షించేందుకు డకోటా విమానాన్ని ఉపయోగించారు. ఇందుకోసం ఇండోనేషియా ప్రభుత్వం కృతజ్ఞతగా ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భూమిపుత్ర'తో బీజూ పట్నాయక్‌ను రెండుసార్లు బహూకరించింది. డకోటా విమానం శిథిలావస్థకు చేరి కోల్‌కతాలోని నేతాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దశాబ్దాలుగా ఉండగా దాని తరలింపునకు నవీన్ పట్నాయక్ చేసిన ప్రయత్నాలు ఫలించాయి. 2020లోనే విమానాన్ని తరలించాల్సి ఉండగా కోవిడ్ కారణంగా సాధ్యం కాలేదు.

తమిళగంపై మాటమార్చిన గవర్నర్

చెన్నై : 'తమిళగం' అంటూ ఇటీవల తాను చేసిన వ్యాఖ్యలతో రాష్ట్రం పేరును మార్చాలని సూచించినట్లు ఊహించడం 'తప్పు, విడ్డూరం' అని తమిళనాడు రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి బుధవారం అన్నారు. 'తమిళనాడు వర్సెస్ తమిళగం' అనే తీవ్ర చర్చకు దారితీసిన వివాదాస్పద వ్యాఖ్యపై వివరణ ఇస్తూ, తన ప్రసంగాన్ని 'అర్థం చేసుకోకుండా' వారు అలా వక్రీకరించారని గవర్నర్ రవి అన్నారు. 'తమిళనాడు పేరును మార్చాలనే సూచన 'తప్పు, విడ్డూరం'గా ఉందని గవర్నర్ ఒక ప్రకటనలో తెలిపారు. 'తమిళ ప్రజలు, కాశీ మధ్య చారిత్రక సాంస్కృతిక అనుసంధానం' గురించి మాట్లాడుతూ తాను 'తమిళగం' అనే పదాన్ని ప్రస్తావించినట్లు ఆయన చెప్పారు. ఆ రోజుల్లో తమిళనాడు లేదన్నారు. 'అందుకే, చారిత్రక సాంస్కృతిక సందర్భంలో నేను తమిళగం అనే పదాన్ని మరింత సముచితమైన వ్యక్తీకరణగా సూచించాను' అని తెలిపారు. అయితే 'నా ప్రసంగాన్ని అర్థం చేసుకోకుండా గవర్నర్ తమిళనాడు అనే పదానికి వ్యతిరేకంగా ఉన్నారనే వాదనలు చర్చనీయాంశంగా మారాయి. అందుకే, దానికి ముగింపు పలికేందుకే నేను ఈ వివరణ ఇస్తున్నాను' అని గవర్నర్ రవి వివరించారు.

తమిళనాడు అంటే 'తమిళుల దేశం'... అయితే తమిళగం అంటే 'తమిళ ప్రజల భూమి' అని అర్థం. 'నాడు' అనే పదానికి అర్థం... తమిళంలో 'భూమి'. అందువల్ల, భారతదేశంలో స్వయంప్రతిపత్తి కలిగిన ప్రాంతంగా వర్ణించడానికి చాలా మంది చూడవచ్చు. తమిళనాడు భారతదేశంలో అంతర్భాగం కాదనే కథనాన్ని పురికొల్పే వారితో ఇది సరితూగుతుందని విమర్శకులు భావిస్తున్నారు. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను ముందుకు తెచ్చేందుకు గవర్నర్ రవి చూస్తున్నారని రాష్ట్రంలో అధికార డీఎంకే ఆరోపించడంతో తీవ్ర దుమారం చెలరేగింది. రాష్ట్ర అసెంబ్లీలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు 'క్విట్ తమిళనాడు' అంటూ గవర్నర్ రవికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే, ట్విట్టర్‌పై 'గెటౌట్ రవి' అనే హాష్‌ట్యాగ్ ట్రెండింగ్ అయింది.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జోక్యం చేసుకుని, రవి రాజ్యాంగానికి కట్టుబడి ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌ను కోరిన తర్వాత గవర్నర్ ఈ ప్రకటన చేశారు. సీఎం స్టాలిన్, ఆయన పార్టీ డీఎంకే గవర్నర్‌తో పదేపదే గొడవ పడ్డారు. అసెంబ్లీలో ప్రభుత్వం ఆమోదించిన అధికారిక ప్రసంగాన్ని చదువుతున్నప్పుడు గవర్నర్ రవి ప్రసంగ పాఠంలోని లేని ఇతర అంశాలకు వెళ్లడంతో శత్రుత్వం పెరిగింది. కాంగ్రెస్ వంటి డీఎంకే మిత్రపక్షాలు కూడా గవర్నర్‌ను రీకాల్ చేయాలని డిమాండ్ చేశాయి.

లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలి

- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా
- భారత్ జోడో యాత్రకు మద్దతు
- ముగింపు సభలో పాల్గొంటామని ఖర్గేకు లేఖ



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మద్దతు తెలిపారు. గణతంత్ర రాజ్యాన్ని తిరిగి పొందేందుకు, రాజ్యాంగ విలువల్ని కాపాడేందుకు లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు, దేశభక్తిభావం కలవారంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. 'మనం బ్రిటీష్ ప్రభుత్వంపై ఐక్యంగా పోరాడాం. అలాగే ఇప్పుడు మనం కలిసికట్టుగా ఆర్ఎస్ఎస్-బీజేపీ ప్రభుత్వాన్ని ఐక్యంగా ఓడించాల్సిన సమయం ఆసన్నమైంది' అని రాజా అన్నారు. ఈ మేరకు ఆయన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు రాసిన లేఖలో పేర్కొన్నారు. జనవరి 30న శ్రీనగర్‌లో జరిగే భారత్ జోడో యాత్ర ముగింపు సభలో తనతో పాటు సీపీఐ పార్లమెంటరీ పార్టీ నాయకుడు బినయ్ విశ్వం పాల్గొంటారని రాజా తెలిపారు. భారత్‌జోడో యాత్ర పేరుతో రాహుల్ సాగిస్తున్న పాదయాత్రను రాజా స్వాగతించారు. విద్వేషాలకు వ్యతిరేకంగా దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండాలన్న పిలుపు స్వాగతించదగినదని అన్నారు. మహాత్మా గాంధీ, డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్, భగత్ సింగ్ కలలుగన్న గణతంత్ర రాజ్యాన్ని తిరిగి పొందేందుకు, రాజ్యాంగ విలువలను పరిరక్షించడానికి, సమ్మిళిత భారతదేశం కోసం పోరాడటానికి లౌకిక ప్రజాస్వామ్య శక్తులు, దేశభక్తులు ఏకం కావడం అత్యవసరమని రాజా లేఖలో స్పష్టం చేశారు. దేశంలో ఐక్యత కోసం మహాత్మాగాంధీ తన ప్రాణాలను అర్పించారని, ఆయన బలిదానం... 'మనం', 'వారు' అనే విభేదాలను తొలగించి, మెరుగైన భారతదేశాన్ని తీర్చిదిద్దేందుకు కలిసి రావడానికి స్ఫూర్తినిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్-బీజేపీలను దుయ్యబడుతూ... 'మన రాజ్యాంగ ప్రవేశికలో పొందుపరిచిన సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, న్యాయం, లౌకికవాదం, సోషలిజం విలువలు మన ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యానికి పునాదిగా నిలుస్తున్నాయి. స్వాతంత్ర్య సమరయోధులు ఊహించిన భారతదేశ ఆలోచనకు ఆర్ఎస్ఎస్-బీజేపీ వ్యతిరేకం. సమానత్వం, సహనం ,సమ్మిళిత భారతదేశం కోసం వారు తమ వద్ద ఉన్నదంతా త్యాగం చేశారు. ఆ ఊహనే వక్రీకరించేందుకు ఆర్ఎస్ఎస్-బీజేపీ ప్రయత్నిస్తున్నాయి' అని రాజా పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర ముగింపు సమావేశంలో పాల్గొనాల్సిందిగా 21 భావ సారూప్య పార్టీల అధినేతలను ఖర్గే ఆహ్వానించిన సంగతి విదితమే.

చంద్రబాబుతో సీపీఐ నేత రామకృష్ణ భేటీ

జీవో-1కు వ్యతిరేకంగా సమైక్య ఉద్యమం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబుతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ భేటీ అయ్యారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో బుధవారం ఆయన కలిసి, రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలపైన, ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించారు. ఈ చర్చల్లో టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మాజీ ఎమ్మెల్సీ తొండెపు దశరథ జనార్ధన్ కూడా ఉన్నారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ మూడున్నరేళ్లుగా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా జగన్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. అన్ని అంశాల్లో పోలీసు రాజ్యాన్ని నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. జీవో నంబరు-1ను హైకోర్టు ధర్మాసనం తీవ్రంగా వ్యతిరేకించి, సస్పెండ్ చేసిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిల్ వేసేందుకు వెళ్లడం దుర్మార్గమని తీవ్రంగా తప్పుపట్టారు. కోర్టులపైన అపహాస్యం చేసేలా జగన్ వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర హక్కుల సంఘాలన్నీ జీవో నంబరు-1ను వ్యతిరేకిస్తున్నామని, ప్రజా ఉద్యమానికి సన్నద్ధమవుతున్నామని చెప్పారు. అందులో భాగంగానే చంద్రబాబుతో భేటీ జరిగిందని రామకృష్ణ తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత సమైక్యంగా ముందుకు వెళతామని స్పష్టం చేశారు.

మాంద్యం తప్పదుగానీ...

ఐఎంఎఫ్ డిప్యూటీ ఎండీ గీతా గోపినాథ్

దావోస్: ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తీవ్ర ప్రభావం చూపుతోందని, ఈ ఏడాది ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ అన్నారు. మాంద్యం తప్పదుగానీ అందులో నుంచి బయటపడగలమన్న సంకేతాలు ఉన్నట్లు తెలిపారు. అమెరికా, యూరప్ సహా వివిధ దేశాల్లోని బలమైన కార్మిక వ్యవస్థ, వినియోగపరమైన డిమాండ్ ఆర్థిక మాంద్యం నుంచి బయటపడేందుకు దోహదమవుతాయని భావిస్తున్నామన్నారు. ఈ ఏడాది చివరికి ప్రపంచాభివృద్ధి అట్టడుగుస్థాయికి దిగజారుతుందని ఐఎంఎఫ్ అంచనా వేస్తోందిగానీ ఈ పరిస్థితి ఎక్కువ కాలం ఉండకపోవచ్చు అని ఆమె తెలిపారు. 2023 ద్వితీయ భాగం నుంచి 2024 నాటికి పరిస్థితులు మెరుగవుతాయని ఆకాంక్షించారు. ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టాలినా జార్జివా ఇటీవల మాంద్యం గురించి హెచ్చరించిన క్రమంలో ప్రపంచ మాంద్యం రాబోతుందనే వార్తలకు గీతా గోపీనాథ్ వ్యాఖ్యలు మరింత బలానిచ్చినట్లు అయింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సు క్రమంలో ఆమె ట్విట్టర్ ద్వారా ఓ వీడియో సందేశమిచ్చారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, కొవిడ్ మహమ్మారి వ్యాప్తి కారణంగా ద్రవ్యోల్బణంలో హెచ్చుతగ్గులతో ఈ ఏడాది కఠిన పరిస్థితులు ఉంటాయి. కొన్ని దేశాల్లోని బలమైన కార్మికవ్యవస్థ, ప్రపంచంలోని కొన్నిప్రాంతాల్లో ఉన్న వినియోగ డిమాండ్‌తో మాంద్యం నుంచి గట్టెక్కవచ్చు' అని ఆమె వెల్లడించారు.

నేడు జీవో1పై సుప్రీం విచారణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో1పై శుక్రవారం సుప్రీంకోర్టు విచారించనున్నది. రహదారులపై బహి రంగ సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతులు లేవంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈనెల 2వ తేదీ జీవో నం-1 తెచ్చింది. ఈ జీవోను రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు ఈనెల 12వ తేదీ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. దీనిని సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పిటిషన్‌పై అత్యవసర విచారణను కోరింది. హైకోర్టు వెకేషన్ బెంచ్‌కు ఈ జీవోపై విచారించే అవకాశం లేదని, సంక్రాంతి సెలవుల నేపథ్యంలో హైకోర్టు నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా విచారణ సాగిందని సుప్రీంకోర్టుకు ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు. పాలనాంశాలపై పిటిషన్లు వెకేషన్ బెంచ్ విచారించదని హైకోర్టు ఈనెల 5న నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. జీవో-1 పాలనాపరమైన అంశానికి సంబంధించినదేనని చెప్పారు. జీవోపై స్టే కొనసాగితే నియంత్రణ లేని రాజకీయ ర్యాలీల కారణంగా అనేకమంది మృతిచెందే అవకాశం ఉందని న్యాయవాది మెహ్‌ఫూజ్ నజ్కీ వాదించారు. దీంతో ఈ వ్యవహారాన్ని గురువారం విచారిస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వ ధర్మాసనం పేర్కొంది.

ఓపీఎస్‌తో ఆర్థిక భారం: ఆర్బీఐ

ముంబై: పాత పింఛను పథకం (ఓపీఎస్) విధానానికి మళ్లుతున్న రాష్ట్రాలు భవిష్యత్తులో తీవ్ర ఆర్థిక భారాన్ని మోయాల్సి ఉంటుందని భారతీయ రిజర్వు బ్యాంకు(ఆర్బీఐ) హెచ్చరించింది. ఆయా రాష్ట్రాల రాబడులు -వ్యయాల మధ్య సమతుల్యత లోపించి ఆర్థిక వ్యవస్థలపై ఒత్తిడి తీవ్రంగా ఉంటుందని పేర్కొంది. 'రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు: 2022-23 బడ్జెట్‌ల పరిశీలన' పేరుతో తాజాగా విడుదల చేసిన నివేదికలో ఆర్బీఐ ఈ వ్యాఖ్యలు చేసింది.

రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు ఓపీఎస్ ప్రయోజనాలు అందిస్తామని హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. ఆ రాష్ట్ర ఆర్థిక శాఖ మంగళవారం దీని అమలుకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలు తమ ఉద్యోగులకు ఓపీఎస్‌ను తిరిగి ప్రారంభించాలన్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వానికి, పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి సంస్థ(పీఎఫ్ఆర్‌డీఏ)కు తెలియజేశాయి. పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం కూడా ఓపీఎస్ అమలుకు సంబంధించి గతేడాది నవంబరులో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ క్రమంలో ఆర్బీఐ వ్యాఖ్యలను ప్రాధాన్యత ఏర్పడింది.

కరోనాతో అటకెక్కిన చదువులు

- పిల్లల్లో తగ్గిన అభ్యాస సామర్థ్యం
- అసర్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: కోవిడ్ కాలంలో పిల్లల చదువు అటకెక్కింది. దాదాపు రెండేళ్లు స్కూళ్లకు వెళ్లని క్రమంలో ప్రాథమిక విద్యాలయాల్లో చదివే విద్యార్థుల్లో అభ్యాస సామర్థ్యం క్రమంగా తగ్గిపోయింది. ఈ మేరకు అసర్-2022 నివేదిక వెల్లడించింది. ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్లో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్ అజయ్ పిరామిల్ బుధవారం ఈ నివేదికను న్యూఢిల్లీలో విడుదల చేశారు. యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (అసర్) పేరుతో ప్రథమ్ సంస్థ 2005 నుంచి క్రమంగా విద్యాస్థితిగతులపై వార్షిక సర్వే నిర్వహించి నివేదికను విడుదల చేస్తోంది. తాజాగా 17వ నివేదికను వెలువరించింది. 2022 సంవత్సరపు అసర్ సర్వే దేశంలోని 616 జిల్లాలకు చెందిన 19,060 గ్రామాల్లో జరిగింది. దాదాపు 30 వేలమంది వలంటీర్లు సర్వేలో భాగమై ఏడు లక్షలమంది పిల్లల అభ్యాస సామర్థ్యాలను పరీక్షించారు. దాదాపు 17 వేల ప్రాథమిక పాఠశాలలోని మౌలిక సదుపాయాలను కూడా పరిశీలించారు. సర్వేలో సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి నివేదికను రూపొందించారు.

మెరుగైన పాఠశాల నమోదు

కరోనా కారణంగా రెండేళ్లపాటు పాఠశాలలు సక్రమంగా పనిచేయలేదు. దాంతో దేశవ్యాప్తంగా అన్నిరకాల పాఠశాలల్లో నమోదు పడిపోయింది. కరోనా తగ్గుముఖం పట్టడంతో పాఠశాలలు సాధారణ స్థాయికి చేరుకున్నాయి. 6-14 వయసుగల పిల్లల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నమోదు 2020 నాటికి జాతీయ స్థాయిలో 97.2 శాతంగా ఉంటే 2022కి 98.4 శాతానికి పెరిగింది. 15 ఏళ్లల్లో పాఠశాల నమోదు ఇంతగా నమోదు కావడం ఇదే తొలిసారని అసర్ నివేదిక పేర్కొన్నది. జాతీయ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో 6-14 ఏళ్ల పిల్లల నమోదు 2014లో 64.9 శాతంగా ఉంది. ఆ సంఖ్య 2018లో 65.6 శాతం కాగా 2022లో 72.9 శాతానికి పెరిగింది. కరోనా తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెరిగే ధోరణి అన్ని రాష్ట్రాలలోనూ ఉందని అసర్ నివేదిక పేర్కొంది.

ఆంధ్రప్రదేశ్‌లో 6-14 వయోవర్గం పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరినవారు 2018లో 63.2 శాతం కాగా 2022లో 70.8 శాతానికి పెరిగింది. జాతీయ స్థాయిలో 11-14 వయోవర్గం బాలికల్లో బడిబయటి బాలికల శాతం గతంలో 10.3 శాతం కాగా ప్రస్తుతం ఇది 2 శాతానికి తగ్గింది. ఈ సంఖ్య తెలంగాణలో 0.5 శాతంగా నమోదు కాగా ఆంధ్రప్రదేశ్‌లో ఒక శాతంగా ఉంది. జాతీయ స్థాయిలో 15-16 వయోవర్గం బాలికల్లో బడిబయటి బాలికల సంఖ్య 2014 వరకు 20 శాతంగా ఉండేది. 2018లో 13.5 శాతం కాగా 2022లో 7.9 శాతానికి తగ్గింది. అదే వయోవర్గం బాలికల్లో తెలంగాణలో ఇంకా బడిబయట ఉన్నవారు మూడు శాతం కాగా ఆంధ్రప్రదేశ్‌లో రెండు శాతంగా ఉన్నారు.

ప్రీ ప్రైమరీ పిల్లల నమోదు సైతం గణనీ యంగా పెరిగిందని అసర్ నివేదిక వెల్లడించింది. మూడో ఏట ఏదో ఒక ప్రీ ప్రైమరీ సంస్థలో నమోదవుతున్న వారిసంఖ్య జాతీయ స్థాయిలో గతంలో 71.2 శాతం కాగా తాజాగా 78.3 శాతానికి పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో 71.3 శాతంగా ఉండగా తాజాగా 80.7 శాతానికి పెరిగింది. డబ్బు చెల్లించి ప్రైవేటు ట్యూషన్లు చెప్పించుకుంటున్న పిల్లల సంఖ్య జాతీయస్థాయిలో గతంలో 26.4 శాతం ఉండగా తాజాగా 30.5 శాతానికి పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో సైతం ట్యూషన్లు చెప్పించుకునే పిల్లల సంఖ్య 14.9 శాతం నుంచి 17.9 శాతానికి పెరిగింది.

మొత్తం మీద పాఠశాల నమోదు పెరగడం, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపడం, బడిబయటి బాలికల సంఖ్య బాగా తగ్గడం, చిన్నపిల్లలను ఏదో ఒక ప్రీ ప్రైమరీ స్కూల్‌లో చేర్చడం వంటి ధోరణులు కన్పిస్తున్నాయని అసర్ నివేదిక పేర్కొన్నది.

డబుల్‌తో గిల్‌కు రెండోస్థానం



- 1000 రన్స్.. విరాట్‌ను అధిగమించి
- అంతర్జాతీయంగా ఫకర్ జమాన్ తరువాత గిల్, ఇమామ్ హక్
- చేజారిన ప్రపంచ రికార్డు



హైదరాబాద్: టమిండియా యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. హైదరాబాద్‌లోని ఉప్పల్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి వన్డే మ్యాచ్‌లో కేవలం 149 బంతుల్లో 19 ఫోర్లు, 9 సిక్సర్లతో 208 పరుగులు పూర్తి చేశాడు. ఈ క్రమంలో ప్రపంచ రికార్డు చేజారినా, విరాట్ కోహ్లి రికార్డును మాత్రం అధిగ మించాడు. 19వ వన్డే ఆడుతున్న గిల్ వెయ్యి పరుగుల మార్క్‌ను ఈ మ్యాచ్‌లోనే అందుకున్నాడు. అత్యంత వేగంగా వన్డేల్లో 1000 పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా అవతరించాడు. విరాట్ కోహ్లి 24 వన్డేల్లో సాధించగా.. గిల్ కేవలం 19 మ్యాచుల్లోనే ఆ ఘనతను సొంతం చేసుకొన్నాడు.

అంతర్జాతీయంగా...

అంతర్జాతీయంగా మాత్రం పాక్ ఆటగాడిదే ఈ రికార్డు కావడం గమనార్హం. పాకిస్తాన్ ఆటగాడు ఫఖర్ జమాన్ కేవలం 18 మ్యాచుల్లో వెయ్యి మార్క్‌ను అందుకొన్నాడు. అలాగే మరో పాక్ బ్యాటర్ ఇమామ్ ఉల్ హక్ 19 మ్యాచుల్లో సాధించాడు. దీంతో గిల్ అంతర్జాతీయంగా ఇమామ్‌తో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. స్టార్ క్రికెటర్లు వివ్ రిచర్డ్స్, బాబర్ అజామ్, కెవిన్ పీటర్సెన్, జొనాథన్ ట్రాట్, క్వింటన్ డికాక్, రస్సీ వాన్‌డర్ డస్సెన్‌ను గిల్ అధిగమించడం విశేషం. వీరంతా 21 ఇన్నింగ్స్‌ల్లో 1000 పరుగుల మార్క్‌ను అధిగమించారు.

'కస్టడీ'పైనే కోటి ఆశలు



హైదరాబాద్: మొదటి సినిమా ఉప్పెన పెద్ద హిట్ అవ్వడంతో కృతిశెట్టి ఒక్కసారిగా పెద్ద స్టార్ అయి పోయింది. తరువాత నానితో నటించిన 'శ్యామ్ సింగరాయ్' సినిమా కూడా హిట్ అయింది. కానీ ఆ తరువాతే కృతి శెట్టికి కొంచెం చుక్కెదురై ఆమె సినిమాలు పరాజయాలు చవి చూశాయి. రామ్ పోతినేనితో చేసిన 'వారియర్' కానీ, నితిన్ తో చేసిన 'మాచర్ల నియోజకవర్గం', అలాగే సుధీర్ బాబు, ఇంద్రగంటి మోహన్ కృష్ణకాంబినేషన్ లో వచ్చిన 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి', ఇవేవీ కూడా బాక్స్ ఆఫీస్ దగ్గర నిలపడం లేదు. కృతి శెట్టిని ఐరన్ లెగ్ అని కూడా అనేశారు. ఇప్పుడు కృతి శెట్టి కొంచెం దారి మార్చి, ఒక్క గ్లామర్ పాత్రలే కాకుండా, వేరే పాత్రలు కూడా చేస్తే బాగుంటుంది అని అనుకుంది కాబోలు, అందుకనే నాగ చైతన్య, వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో వస్తున్న 'కస్టడీ' సినిమాలో కొంచెం సీరియస్ పాత్ర చేస్తున్నట్టుగా అనిపిస్తోంది. కృతి శెట్టి లుక్ ఈ సినిమా నుంచి విడుదల చేశారు. ఇది తెలుగు, తమిళ భాషల్లో విడుదల అవుతోంది. అందుకోసం షూటింగ్ శరవేగంగా జరుపు కుంటోంది. ఇందులో కృతి రేవతి అనే పాత్ర చేస్తోంది. అని చిత్ర నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ లుక్‌లో కృతి కథ లో భాగమై ఒక బలమైన పాత్ర చేస్తున్నట్టుగా తెలుస్తోంది. తమిళ నటుడు అరవింద్ స్వామి ఇందులో విలన్ పాత్రలో కనిపిస్తున్నాడు, కాగా ప్రియమణి ఇంకో ప్రధాన పాత్రలో కనిపించనుంది. అక్కినేని హీరో నాగ చైతన్య కెరీర్‌లో అత్యంత ఖరీదైన చిత్రాల్లో కస్టడీ ఒకటి. శ్రీనివాస చిట్టూరి దీనికి నిర్మాత. మాస్ట్రో ఇళయరాజా కుమారుడు యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.

కోచ్‌లు, అధ్యక్షుడు వేధిస్తున్నారు

లైంగిక వేధింపులంటూ వినేశ్ ఫొగాట్ సంచలన ఆరోపణలు

న్యూఢిల్లీ: రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్, కోచ్‌లపై స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ సంచలన ఆరోపణలు చేసింది. మహిళా రెజ్లర్లను వారు లైంగికంగా వేధిస్తున్నారని, ఆయన వల్ల తాను ఓసారి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని తెలిపింది. వీరి ఆగడాలకు వ్యతిరేకంగా దేశంలోని స్టార్ రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వినేశ్ మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి గురైంది. "మహిళా రెజ్లర్లను బ్రిజ్ భూషణ్, జాతీయ కోచ్‌లు లైంగికంగా వేధించారు. నన్ను ఎందుకూ పనికిరావని తిట్టారు. బ్రిజ్ భూషణ్ వేధింపుల వల్ల నేను ఎంతో మానసిక క్షోభకు గురయ్యా. ఓసారి ఆత్మహత్య కూడా చేసుకోవాలనుకున్నా. మా గాయాల గురించి ఎవరూ పట్టించుకోరు. ఆయనపై ఫిర్యాదు చేసినందుకు గతంలో నన్ను చంపేస్తానంటూ బెదిరింపులు కూడా వచ్చాయి' అంటూ ఆమె కన్నీళ్లు పెట్టుకుంది.

రెజ్లర్లను కొట్టేవారు: భజరంగ్ పూనియా

ఈ సందర్భంగా మరో స్టార్ రెజ్లర్ భజరంగ్ పూనియా మాట్లాడుతూ 'ఫెడరేషన్‌లో ఉన్నవారికి ఆట గురించి ఏ మాత్రం తెలియదు. రెజ్లర్లను వారు చాలా వేధిస్తున్నారు. బ్రిజ్ భూషణ్ మమ్మల్ని తిట్టేవారు. కొట్టారు కూడా. మా పోరాటం ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాపై కాదు. కేవలం రెజ్లింగ్ ఫెడరేషన్‌పైనే' అని చెప్పాడు.

ఈ ఆందోళనలో పూనియా, ఫొగాట్, సాక్షిమాలిక్, సంగీతా ఫొగాట్, సుమిత్ మాలిక్, సరితా మోర్ సహా 30 మంది స్టార్ రెజ్లర్లు పాల్గొన్నారు. బ్రిజ్ భూషణ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగించేవరకు తాము ధర్నా కొనసాగిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. అప్పటిదాకా ఏ అంతర్జాతీయ పోటీల్లోనూ తాము పాల్గొనబోమని స్పష్టం చేశారు.

నిరూపిస్తే ఉరేసుకుంటా: బ్రిజ్ భూషణ్

రెజ్లర్లు చేసిన ఆరోపణలపై రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ స్పందించారు. వారి ఆరోపణలను తనపై కుట్రగా అభివర్ణించారు. ఇందులో ఓ పెద్ద పారిశ్రామిక వేత్త హస్తముందని ఆరోపించారు. వినేశ్ ఫోగట్ ఓడిపోయినప్పుడు తాను ఓదార్చి ప్రేరణ కలిగించానని విషయాన్ని గుర్తుచేశారు. లైంగికంగా వేధించారని ఏ ఒక్కరైనా నిరూపిస్తే తాను ఉరి వేసుకుంటానని చెప్పారు. రెజ్లింగ్ అధ్యక్ష పదవికి మాత్రం రాజీనామా చేయబోనని స్పష్టం చేశారు. 2011 నుంచి బ్రిజ్ భూషణ్ రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 2019లో వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేపీ నేత అయిన భూషణ్.. ఉత్తరప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఆస్ట్రేలియా ఓపెన్... ఇంటి దారి పట్టిన నాదల్

న్యూఢిల్లీ: డిఫెండింగ్ ఛాంపియన్ రఫేల్ నాదల్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్ 2023లో చుక్కెదురైంది. మరోసారి టైటిల్ సాధించాలని బరిలోకి దిగిన నాదల్ రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. అమెరికాకు చెందిన మెకంజీ మెక్‌డొనాల్డ్ చేతిలో 6-4, 6-4, 7-5 తేడాతో నాదల్ ఓడిపోయాడు. గడచిన ఏడాది కాలంలో నాలుగుసార్లు అమెరికా ఆటగాళ్ల చేతిలో భంగపాటుకు గురికావాల్సి వచ్చింది. ఫ్రాన్సిస్ టియాఫో (యూఎస్ ఓపెన్ 2022 రెండో రౌండ్), టామీ పాల్ (పారిస్ మాస్టర్స్ 2022, తొలి రౌండ్), టేలర్ ఫ్రిట్జ్ (ఏటీపీ వరల్డ్ టూర్ ఫైనల్స్ గ్రూప్ స్టేజ్)పై నాదల్ ఓటమి తప్పలేదు. దీంతో 23వ గ్రాండ్‌స్లామ్‌ను తన ఖాతాలో వేసుకుందామని భావించిన నాదల్ ఆశలకు కళ్లెం పడింది. తుంటి గాయంతో ఇబ్బంది పడుతున్న రఫేల్ నాదల్ తన అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించలేకపోయాడు. రెండో సెట్ జరుగుతున్న సమయంలోనే నొప్పితో బాధపడుతూ మెడికల్ టైమ్ ఔట్ తీసుకొన్నాడు. మరోవైపు మహిళల టెన్నిస్‌లో నంబర్‌వన్ ర్యాంకర్ ఇగా స్వైటెక్ సులువుగా మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. కొలంబియాకు చెందిన కామిలా ఒసోరియాపై 6-2, 6-3 తేడాతో స్వైటెక్ విజయం సాధించింది.

ఆకట్టుకుంటున్న 'కొటేషన్ గ్యాంగ్' ట్రైలర్

చెన్నై: సీనియర్ నటి ప్రియమణి ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం 'కొటేషన్ గ్యాంగ్'. కిరాయి హత్యలు చేసే ముఠా కథాంశంతో తెరకెక్కించారు. ఫిల్మినెటీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానరుపై తమిళ, హిందీ భాషల్లో నిర్మించగా, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో డబ్ చేసి ఏప్రిల్‌లో విడుదల చేసేలా ప్లాన్ చేశారు. హీరోయిన్ ప్రియమణి, బాలీవుడ్ సీనియర్ నటుడు జాకీష్రాఫ్, నటి సన్నీ లియోన్, సారా అర్జున్ తదితరులు కీలకపాత్రల్లో నటించారు. వివేక్ కె.కన్నన్ దర్శకత్వం వహించగా.. గాయత్రి సురేష్, వివేక్ కె. కన్నన్ నిర్మించిన ఈ చిత్రానికి డ్రమ్స్ శివమణి సంగీతం అందించారు. సంగీత దర్శకుడు డ్రమ్స్ శివమణితో కలిసి దర్శకుడు మాట్లాడుతూ.. 'ముంబై, కశ్మీర్, చెన్నై ప్రాంతాల మధ్య కిరాయి హత్యలు చేసే గ్యాంగ్‌లకు సంబంధించిన కథ. ఒక హత్య కేసుతో ఈ మూడు ప్రాంతాలకు కనెక్ట్ అవుతాయి. అది ఏంటి అనేది సస్పెన్స్. నిజానికి ఓటీటీ కోసమే ఈ చిత్రాన్ని నిర్మించాం. కానీ, కంటెంట్, విజువల్స్ చూస్తే థియేట్రికల్ మూవీ స్థాయిలో చాలా గ్రాండ్‌గా వచ్చింది. అందుకే థియేటర్‌లో ఏప్రిల్‌లో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం. ఇది ఒక మల్టీస్టారర్ మూవీ. హైపర్ లింక్ కంటెంట్ కావడంతో తీవ్ర జాప్యం నెలకొంది. నాలుగు స్టోరీలు, మూడు ప్రాంతాల్లో సాగుతాయి. స్క్రిప్టు రాసే సమయంలోనే సంగీత దర్శకుడిగా డ్రమ్స్ శివమణి ఫిక్స్ చేశాం. సన్నీ లియోన్, జాకీష్రాఫ్ పాత్రలు చాలా బాగా వచ్చాయి' అని వివరించారు'. 'ఈ సినిమా కథ ఏంటో నాకు తెలియదు. టీజర్ చూసే సంగీతం సమకూర్చేందుకు అంగీకరించాను' అని డ్రమ్స్ శివమణి తెలిపారు. కాగా ఇటీవలే ఈ మూవీ ట్రైలర్‌ని కూడా చిత్రబృందం విడుదల చేసింది. ఆ ట్రైలర్‌కి మంచి స్పందన వస్తోంది.

అమ్మకు అరుణాంజలి

కీ॥శే॥ కమలమ్మగారు

W/o. కీ॥శే॥ కామినేని రామచంద్రరావు (చంద్రం) గారు

ఆత్మీయతను పంచిన అమృతమూర్తి, కుటుంబానికి కేంద్రబిందువు, మీ జ్ఞాపకాలే ఇక మాకు స్ఫూర్తి. మీ ఆత్మశాంతి కోసం మా ప్రార్థన

ది.05-01-2023వ తేదీన పరమపదించారు.
ది.19-01-2023 గురువారం నాడు
గన్నవరం సొసైటీ పేట, రైస్ మిల్లు వద్ద గల
సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ నుండి కరెంట్ ఆఫీసు రోడ్డులో
గల మా స్వగృహము నందు
శ్రద్ధాంజలి (పెద్దకర్మ) కార్యక్రమము
జరుపబడును. కావున తెలియజేయడమైనది.

ఇట్లు
కుటుంబ సభ్యులు

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.